4న మద్దూరుకు ముఖ్యమంత్రి రాక

మద్దూరు, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 4న మద్దూరులో పర్యటించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు వంచర్ల బాలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. మద్దూరులో నిర్మిస్తున్న గురుకుల, డిగ్రీ కళాశాల భవనాలు, రోడ్ల వెడల్పు పనులు పరిశీలిస్తారన్నారు. అనంతరం వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ పర్యటిస్తారన్నారు. బొంరాస్‌పేట మండలం పోలేపల్లిలో కొడంగల్ నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించనున్నట్లు వివరించారు.

కాల్వ కుంగి.. ప్రమాదం పొంచి

జూరాల జలాశయం నుంచి కోయిలసాగర్‌కు వచ్చే కాల్వ ఇది. సాగర్ దగ్గర ధ్వంసం కావడంతో ప్రమాదకర పరిస్థితి నెలకొంది. మరమ్మతులు చేయకపోతే కట్ట పూర్తిగా తెగిపోయి, పంటలు నీట మునిగే ప్రమాదం ఉంది. పలుచోట్ల లైనింగ్ లేకపోవడంతో కట్టలు కోతకు గురవుతున్నాయి. ఇప్పటికైనా తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, దేవరకద్ర

'సౌర'భానికి వేదికేనా?

భవనాల పరిస్థితిపై నివేదిక కోరిన ప్రభుత్వం

మహబూబ్‌నగర్ వ్యవసాయం, అయిజ, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా రైతు వేదిక భవనాలపై సౌర పలకల ఏర్పాటు చేయాలని భావిస్తోంది. వీటిని అమర్చేందుకు హైదరాబాద్ వ్యవసాయ సహకార సంఘాని(హాకా)కి బాధ్యతలు అప్పగించింది. ఈ నేపథ్యంలో జిల్లాల వారీగా రైతు వేదిక భవనాల స్థితిగతులపై జిల్లా వ్యవసాయాధికారులను నివేదిక కోరింది.

నిర్వహణ లోపంతో.. : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 472 రైతు వేదికల నిర్మాణాలకు రూ.103.84 కోట్లు వెచ్చించారు. మహబూబ్‌నగర్ జిల్లాలో 88 వేదికలున్నాయి. ఏళ్ల తరబడి నిర్వహణ లేక చాలా భవనాలు అధ్వానంగా మారాయి. రక్షణ లేకపోవడంతో చాలా చోట్ల ఎలక్ట్రిక్ పరికరాలు, బ్యాటరీలు, విలువైన వస్తువులు చోరీకి గురయ్యాయి. దొంగతనాలను అరికట్టడానికి ఇప్పటికైనా సౌర విద్యుత్తు కంచె ఏర్పాటు చేయాలని రైతులు, వ్యవసాయాధికారులు కోరుతున్నారు.

రైతేరాజు 6లో..

గంజాయి గుప్పు.. కానరాని తప్పు

- హైదరాబాద్, ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి
- ఉమ్మడి జిల్లాలో విచ్చలవిడిగా విక్రయాలు

● జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డులో ఆదివారం 5.50 కిలోల ఎండు గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇంత భారీ మొత్తంలో పోలీసులకు సరకు దొరకడం ఉమ్మడి జిల్లాలోనే ఇదే మొదటిసారి.

● మహబూబ్‌నగర్‌లో ఐదు గ్రాముల ఎండు గంజాయిని ప్యాకెట్లుగా చేసి విక్రయిస్తున్నారు.

కొందరు యువకులు ఇతర ప్రాంతాల నుంచి తెచ్చి వాటిని ప్లాస్టిక్ కవర్లలో పెట్టి అమ్ముతున్నారు. సులువుగా అడ్డదారిలో డబ్బు సంపాదించాలని పలువురు ఈ దందా సాగిస్తున్నారు.

● మహబూబ్‌నగర్, జడ్చర్ల, కల్వకుర్తి, వనపర్తి, నాగర్‌కర్నూల్, కొత్తకోట, పెబ్బేరు, అలంపూర్, గద్వాల, నారాయణపేట, మక్తల్, మరికల్, కొల్లాపూర్, అచ్చంపేట తదితర ప్రాంతాల్లో సులువుగా గంజాయి ప్యాకెట్లను యువతకు విక్రయిస్తున్నారు.

మహబూబ్‌నగర్ నేరవిభాగం, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. గతంలో అరకొరగా ఉంటూ, గుట్టుచప్పుడు కాకుండా నడుస్తున్న దందా ఇప్పుడు బహిరంగంగానే ఆయా ప్రాంతాల్లో నడుస్తోంది. మహబూబ్‌నగర్ ఎంవీఎస్ డిగ్రీ కళాశాల వెనక భాగంలో నిర్మాణంలో ఉన్న భవనాల్లో కొందరు విద్యార్థులు గంజాయి మత్తులో మునుగుతున్నారు. గంజాయిని విక్రయించేవారు అక్కడికి వచ్చి విద్యార్థులకు అందిస్తున్నట్లు సమాచారం. ఇతర ప్రాంతాల్లోనూ ఇదే తరహాలో గంజాయి మత్తులో యువత చిత్తవుతోంది. హైదరాబాద్‌లోని ధూల్‌పేట్, కర్నూలు, నల్లమల అటవీ ప్రాంతం, రాయచూర్ తదితర ప్రాంతాల నుంచి అక్రమార్కులు సరకు దిగుమతి చేసుకుంటున్నారు. వీటిని 5 గ్రాముల ప్యాకెట్లుగా చేసి రూ.400-600కు విక్రయిస్తున్నారు. ఇందులో ఆటో డ్రైవర్లు కీలకంగా వ్యవహరిస్తున్నారు. పోలీసులు, ఎక్సైజ్ శాఖ సిబ్బంది కళ్లు గప్పి వాటిని విక్రయించడం గమనార్హం.

నియంత్రణకు కృషి: ఉమ్మడి జిల్లాలో గంజాయి కేసుల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నాం. ఇందుకోసం సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించారు. పలు ప్రాంతాల్లో నిఘా పెట్టి తనిఖీలు చేస్తున్నారు. గంజాయిని నిర్మూలించడానికి మారుమూల ప్రాంతాల్లోనూ తనిఖీలు చేస్తున్నాం. - **విజయభాస్కర్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్, ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ శాఖ**

మహబూబ్‌నగర్‌లోనే అత్యధిక కేసులు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎక్కువ గంజాయి విక్రయాలు, వినియోగంలో మహబూబ్‌నగర్ జిల్లా ముందంజలో ఉంది. గతేడాది ఉమ్మడి జిల్లాలో 27 కేసులు నమోదు కాగా, అందులో మహబూబ్‌నగర్‌లో 21 నమోదయ్యాయి. ఇక్కడ ఏ మేరకు గంజాయి వాడకం ఉందో ఈ గణాంకాలే చెబుతున్నాయి. ● నారాయణపేట, వనపర్తి జిల్లాల్లో రెండేసి చొప్పున, నాగర్‌కర్నూల్, జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఒకటి చొప్పున కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు 16 కేసులు నమోదు కాగా, అందులో మహబూబ్‌నగర్ జిల్లాలో 13 ఉన్నాయి. నాగర్‌కర్నూల్‌లో రెండు, జోగులాంబ గద్వాల జిల్లాలో ఒకటి చొప్పున కేసులను పోలీసులు నమోదు చేశారు.

20 ఏళ్లుగా గలీజు దందా

జడ్చర్లలో తాఖీదులతో సరిపెడుతున్న యంత్రాంగం

నోటీసులిచ్చిన దుకాణాలు ఇవే..

జడ్చర్ల, న్యూస్‌టుడే: ప్రభుత్వ సముదాయాల్లో వేలంలో అద్దెకు దుకాణాలు లభిస్తే కాలపరిమితి ఏడాదో రెండేళ్లో ఉంటుంది. జడ్చర్లలో నిర్వాహకుల తీరు చేస్తుంటే జీవిత కాలం వారికే సొంతమన్నట్లు గలీజు దందా సాగిస్తున్నారు. ఇతరులకు వారే సబ్ లీజుకు ఇచ్చి దండుకుంటున్నారు. వీరి దందా తరహాలో మరికొందరు ఏకంగా పక్కనున్న ప్రభుత్వ భూముల్లో డబ్బాలు పెట్టుకొని వ్యాపారాలు నడిపిస్తున్నారు. వాటిని అద్దెలకు ఇస్తున్నారు. అధికారులు నోటీసులతో సరిపుచ్చుతున్నారనే ఆరోపణలున్నాయి. ● జడ్చర్ల సిగ్నల్‌గడ్డ కూడలి సమీపంలోని ప్రధాన రహదారి పక్కనున్న ఎంపీడీవో కార్యాలయ స్థలంలో 2006లో ఆరు దుకాణాలు నిర్మించారు. అప్పట్లో దుకాణాలు పొందిన వారు ఇతరులకు ఎక్కువ మొత్తానికి సబ్‌లీజ్‌కు ఇచ్చారు. అంతటితో ఆగకుండా దుకాణాల ముందు షెడ్లు వేసి అద్దెలకిచ్చారు. ఇలా అదనంగా 15 డబ్బాలు(షట్టర్లు) పుట్టుకొచ్చాయి.

సొంతంగా షట్టర్లు ఉన్నా.. టెండర్లలో దుకాణాలు దక్కించుకున్న వారిలో కొంత మందికి సొంతంగా పెద్ద భవనాలు, షట్టర్లు ఉన్నాయి. రెండు చోట్ల అద్దెలకు ఇచ్చి లాభపడుతున్నారు. ఇదిలా ఉండగా.. ప్రభుత్వ స్థలంలోని టీఎన్‌జీవో భవనంలో రెండు దుకాణాలు దక్కించుకున్న ఇద్దరికి సొంత భవనాలు, అందులో షట్టర్లు ఉండటం గమనార్హం. వీటిని నిరుద్యోగులు, పేదలు, దివ్యాంగులకు కేటాయిస్తే ప్రయోజనకరంగా ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అధికారి బంధువుకు అప్పగింత

ఓ దుకాణాన్ని జిల్లా పరిషత్‌లో పని చేసే ఓ అధికారి బంధువుకు అప్పగించడం గమనార్హం. అయితే అద్దెలు చెల్లించకపోవడం, నిబంధనలు పాటించకపోవడంతో పలుమార్లు ఖాళీ చేయాలని అధికారులు తాఖీదులు జారీ చేసినా ఫలితం ఉండలేదు. రాజకీయ పలుకుబడితో కొనసాగుతున్నారు.

ఎంపీడీవో ఏమన్నారంటే.. నిబంధనల ప్రకారం రెండేళ్లకోసారి టెండర్లు జరగాలి. ఇక నుంచి ఈ ప్రక్రియ చేపడతాం. అందుకు నోటీసులు ఇచ్చాం. ఖాళీ చేశాక టెండర్లు వేస్తాం. - **విజయ్‌కుమార్, ఎంపీడీవో, జడ్చర్ల**

అత్యాధునిక ప్రమాణాలతో ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు

చిన్నచింతకుంట, న్యూస్‌టుడే: చిన్నచింతకుంట మండలం దమగ్నాపురంలో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల పనులను ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో అక్కడే సమీక్షా సమావేశం నిర్వహించారు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలు, అత్యాధునిక సౌకర్యాలతో బోధన అందించాలనే లక్ష్యంతో ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణాలు చేపడుతున్నామని అన్నారు. కౌకుంట్లలో తెలంగాణ మోడల్ స్కూల్‌ని ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. అందుకు 5 ఎకరాల స్థలం కేటాయించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎల్లన్న, ఎంపీడీవో అనురాధ, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వెంకటేశ్ పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

'గుట్ట'మట్టు పట్టి.. ఆపై ఆక్రమణ బాటపట్టి

నిఘా

ఈనాడు డిజిటల్, నాగర్‌కర్నూల్: జిల్లాలో ప్రభుత్వ భూములకు ఆనుకుని ఉన్న కొందరు పట్టాదారులు క్రమంగా హద్దులు దాటి భూములను చదును చేస్తూ స్వాధీనం చేసుకుంటున్నారు. ప్రభుత్వ గుట్టల్లోని మట్టిని కొందరు అక్రమంగా తరలిస్తుంటే.. ఆ తర్వాత అదే ప్రాంతాన్ని ఇంకొందరు చదును చేసి క్రమంగా సాగుభూమిగా మార్చేస్తున్నారు.

లింగాల మండలంలోని అంబటిపల్లి గ్రామంలోని సర్వేనం 471లో 6.36 ఎకరాల ప్రభుత్వ భూమిని కొందరు వ్యక్తులు అక్రమంగా చదును చేసి సాగుకు సిద్ధపడ్డారని పంచాయతీ తరపున ఉపసర్పంచి సోమవారం 'ప్రజావాణి'లో ఫిర్యాదుచేశారు.

ఇలాంటివి కొన్ని ఇలా...!: కోడేరులోని ఊరగుట్టను మూడు ఎకరాల వరకు తవ్వేసి చుట్టూ మామిడితోటను పెంచుతున్నారు. పసుపుల నడిగట్టు శివారున రెండెకరాల వరకు సాగుచేస్తున్నారు. బావాయిపల్లి శివారులోని ఎల్లమ్మతిప్ప వద్ద ఉన్న భూమి ఆక్రమణకు గురవుతోంది. తెలకపల్లి, రఘుపతిపేటకు సమీపంలోని రామగిరిగుట్ట మట్టిని నిత్యం తరలిస్తున్నారు. అక్కడ చదును చేసిన ప్రాంతంలో క్రమంగా కొందరు వ్యక్తులు సాగులోకి తెస్తున్నారు. పెంట్లవెల్లి మండలం మంచాలకట్ట సమీపంలోని ప్రభుత్వ భూములను క్రమంగా చదును చేస్తున్నారు. అటవీ భూములు ఆనుకుని చెట్లు తొలగించి సాగులోకి తెస్తున్నారు.

అంబాట్‌పల్లిలోని గుట్ట వద్ద ఇలా..

ఆర్ఐతో విచారణ: అంబాట్‌పల్లి శివారులోని సర్వేనం 471లో ప్రభుత్వ భూమి ఉంది. ఆక్రమణ విషయమై ఆర్ఐతో క్షేత్రస్థాయిలో విచారణ జరిపిస్తాం. తగిన చర్యలు తీసుకుంటాం. - **వెంకటేశ్, తహసీల్దార్, లింగాల**

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి రైల్వే పనుల గురించి వివరిస్తున్న డీఆర్ఎం సంతోష్ కుమార్‌వర్మ, చిత్రంలో ఎంపీ డీకే అరుణ

రైల్వే హబ్‌గా పాలమూరు

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

మహబూబ్‌నగర్ నగరం, మెట్టుగడ్డ, న్యూస్‌టుడే: మహబూబ్‌నగర్‌ను రైల్వే హబ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని కేంద్ర, బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మహబూబ్‌నగర్ రైల్వే స్టేషన్‌లో ఆధునికీకరణ పనులను ఎంపీ డీకే అరుణ, డీఆర్ఎంతో కలిసి పర్యవేక్షించారు. 2014కు ముందు రైల్వే స్టేషన్లలో కనీస వసతులుండేవి కావని, పదేళ్లలో వంద కొత్త రైళ్లను రాష్ట్రంలో అందుబాటులోకి తెచ్చామన్నారు. కొత్త రైల్వే లైన్లు, ట్రాక్‌ల ఉన్నతీకరణ చేపడుతున్నామన్నారు. హైదరాబాద్-బెంగళూరు మధ్య బుల్లెట్ రైలు అలైన్‌మెంట్ ఇంకా ఖరారు కాలేదన్నారు. ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో ఐదు స్టేషన్లను అమృత్ పథకం కింద అభివృద్ధి చేసుకుంటున్నామని, వచ్చే ఏడాది మార్చి వరకు మహబూబ్‌నగర్ స్టేషన్ అందుబాటులోకి రానుందన్నారు. టీడీగుట్ట ఆర్వో మంజూరైందని, త్వరలో టెండర్లు ఆహ్వానిస్తామని చెప్పారు. వీరన్నపేట, బోయపల్లిగేట్ ఆర్వోబీలతో పాటు మోతీనగర్‌లో పాదచారుల వంతెన, దేవరకద్రలో ఎల్‌హెచ్‌ఎస్ కోసం కృషి చేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో డీఆర్ఎం సంతోశ్ కుమార్ వర్మ, భాజపా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విభేదాలు పక్కన పెట్టండి: భాజపా నాయకులు అంతర్గత విభేదాలుంటే పక్కన పెట్టాలని, పార్టీ కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ చురుగ్గా పాల్గొనాలని జిల్లా పదాధికారుల సమావేశంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సూచించారు. కలిసికట్టుగా పనిచేస్తే రానున్న ఎన్నికల్లో తెలంగాణలో భాజపాదే అధికారమని ఆశాభావం వ్యక్తం చేశారు. స్థానిక కార్పొరేటర్ దర్పల్లి సువర్ణహరికృష్ణ ఛత్రపతి శివాజీ చిత్రపటంతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీ డీకే అరుణ, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, నేతలు పి.శ్రీనివాస్‌రెడ్డి, పద్మజారెడ్డి, పడాకుల బాలరాజు, ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

'నాకూ సర్ నోటీసొచ్చింది'

'సర్ ప్రక్రియలో స్పెల్లింగ్ తప్పిదాలతో నోటీసులొస్తే జవాబు తప్పకుండా చెప్పండి. జి.కిషన్‌రెడ్డి, గంగాపురం కిషన్‌రెడ్డి ఇలా రెండు విధాలుగా నమోదు కావడంతో నాకు కూడా నోటీసు వచ్చింది. ఈ విషయంలో ప్రజలకు భాజపా కార్యకర్తలు సహకరించాలి.' కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

రెండు ఉంగరాలు తాకట్టు పెట్టి..

- ఆర్భాటానికి అప్పులు.. సమస్యలు తీరక తిప్పలు
- రూ.కోట్లలో ఆదాయమున్నా ఏఎంసీల దైన్యమిది

తన రెండు గాజులు అమ్ముకోవాల్సి వచ్చింది.. - ఓ క్యాన్సర్ బాధితురాలి చికిత్స కోసం చేసిన ఖర్చు గురించి సినిమా థియేటర్‌లో వచ్చే ప్రకటనలోని డైలాగ్ ఇది.

నా చేతికి ఉన్న రెండు ఉంగరాలు, ఇతర బంగారు వస్తువులు గిరవి పెట్టాల్సి వచ్చింది. అయినా ఇప్పటి వరకు బిల్లులు విడుదల చేయలేదు. - నిర్వహణ నిధులు లేకున్నా వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో ఆర్భాటంగా ప్రజాపాలన కార్యక్రమాలు జరపాల్సి రావడంతో ఓ అధికారి సొంత నిధులు వ్యయం చేసిన వైనం.

జడ్చర్ల, న్యూస్‌టుడే: పైన డాబుసరి కోటు.. లోపల చిల్లుల చొక్కా వేసుకున్నట్లుంది జిల్లాలో వ్యవసాయ మార్కెట్ కమిటీ(ఏఎంసీ)ల పరిస్థితి. ఏటా రూ.కోట్లలో ఆదాయం సమకూరుతున్నా ఏ చిన్న పని చేయాలన్నా ప్రభుత్వాన్ని అడుక్కోవాల్సిన దుస్థితి నెలకొంది. ఈ క్రమంలో చిల్లిగవ్వ విడుదల చేయకుండా ఆర్భాటంగా ప్రజాపాలన కార్యక్రమాలు జరపాలనడంతో అధికారులు అప్పుల పాలయ్యారు.

● జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ కమిటీల ఆదాయానికి కొదవే లేదు. అత్యధిక ఆదాయం వచ్చేది బాదేపల్లి మార్కెట్‌కు. ఇక్కడ గతేడాది రూ.7 కోట్లు సమకూరింది. మహబూబ్‌నగర్, దేవరకద్ర, నవాబుపేట, బాలానగర్ మార్కెట్ కమిటీలు కూడా నిర్దేశించిన లక్ష్యాలను సాధిస్తున్నాయి. కానీ సిబ్బంది వేతనాలకు తప్ప, నిర్వహణకు నిధులు విడుదల కావడంలేదు.



సరిగా లేదని తొలగించి మళ్లీ ఏర్పాటు చేయాల్సిన గాంధీ విగ్రహమిది

బాపూ.. క్షమించు.. : బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ ఆవరణలో షెడ్డు నిర్మాణానికి అడ్డుగా ఉందని గాంధీ విగ్రహాన్ని తొలగించి ప్రవేశ ద్వారం వద్ద ఏర్పాటు చేయాలని దాతల సాయంతో కొత్త విగ్రహం తెచ్చారు. ఆ విగ్రహం సరిగాలేదని, చుట్టూ ప్లాట్‌ఫాంను పెంచాలని ప్రారంభోత్సవం వాయిదా పడింది. మరో విగ్రహం ఏర్పాటుకు దాత కుటుంబీకులు ముందుకొచ్చినా ప్లాట్‌ఫాం నిర్మాణానికి మార్కెటింగ్ శాఖ వద్ద డబ్బులు లేక నిస్తేజంగా ఉండిపోయారు.

పుండు మీద కారం చల్లేలా..: డబ్బులు లేక మార్కెట్ కమిటీలు తంటాలు పడుతుంటే పుండు మీద కారం చల్లేలా ప్రజాపాలన కార్యక్రమాలు ఆర్భాటంగా జరపాలని ప్రభుత్వం ఆదేశించింది. అతిథులకు పుష్పగుచ్ఛాలు, సన్మానాలు, భోజనాలు, టెంట్లు, కుర్చీలు ఏర్పాటు చేసి భారీ సభ నిర్వహించాలని రెండు నెలల కిందట చెప్పింది. దీంతో అధికారులు అప్పుచేసి ఆ హడావుడి కానిచ్చారు.

ఇదీ అధికారి ఆవేదన: 'మా కార్యాలయ నిర్వహణ చాలా భారంగా మారింది. అప్పు చేసి స్టేషనరీ కొంటున్నాం.. నా చేతి ఉంగరాలు, బంగారు వస్తువులు కుదువ పెట్టి ప్రజాపాలన కార్యక్రమాలు నిర్వహించాం. సమస్యలు ఎందుకు పరిష్కరించం లేదంటూ అందరూ ఉన్నతాధికారిని దబాయిస్తున్నారు.. డబ్బులు లేకుండా ఆయనేం చేస్తారు.' అంటూ ఓ అధికారి వాపోయారు.

● జడ్చర్ల వ్యవసాయ మార్కెట్‌లో కరెంట్ పోయినప్పుడు దీపాలు వెలిగించే జనరేటర్ మొరాయించింది. పాత బకాయిలు చెల్లిస్తేనే పారిశుద్ధ్య పనులు చేస్తామని కార్మికులు చెబుతున్నారు. 'వ్యవసాయ మార్కెట్ల నిర్వహణ ఇబ్బందికరంగా ఉన్నా, సర్దుకుపోతున్నాం. నిధుల మంజూరుకు అనుమతి లభించింది. త్వరలో వస్తాయని ఆశిస్తున్నాం' అని జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి బాలమణి తెలిపారు.

విద్యార్థుల్లో సమగ్ర వికాసం

గద్వాల న్యూటౌన్, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, సేవాభావం, క్రమశిక్షణ పెంపొందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పాఠశాలల్లో భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమం నిర్వహిస్తోంది. గతేడాది నుంచి కొన్ని పాఠశాలల్లో అమలు చేస్తుండగా, తాజాగా మరికొన్ని బడుల్లో అమలు చేసేందుకు నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులొచ్చాయి. ఈ మేరకు ఒక్కో పీఎంశ్రీ పాఠశాలకు రూ.2.50 లక్షలు చొప్పున ఉమ్మడి జిల్లాకు రూ.2.87 కోట్లు, సాధారణ పాఠశాలలకు రూ.69 వేలు చొప్పున రూ.1.07 కోట్లు మంజూరయ్యాయి. ఈ నెలలోనే బృందాలను ఏర్పాటు చేయాలని ఆదేశాలందాయి.

రాజోలి కేజీబీవీలో మొక్కలు నాటేందుకు గుంత తవ్వుతున్న స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థినులు

మహబూబ్‌నగర్ జిల్లాలో జడ్పీ/పీఎంశ్రీ పాఠశాలలు	నిధులు (రూ.లక్షల్లో)
40/26	27.60/65

నిర్వహించే కార్యక్రమాలు..

సమగ్ర వికాసం : విద్యార్థుల శారీరక, మానసిక, ఆధ్యాత్మిక వికాసానికి తోడ్పడుతుంది.

సేవా దృక్పథం: సమాజంలో తోటి వారికి సహాయ పడటం, బాధ్యత గల పౌరులుగా తీర్చిదిద్దడం, పారిశుద్ధ్య కార్యక్రమాల్లో భాగస్వామ్యమయ్యేలా నేర్పిస్తారు.

శిక్షణ శిబిరాలు : విపత్తుల సమయంలో చేయాల్సిన పనులు, ప్రథమ చికిత్స వంటి వాటిపై శిక్షణ ఇస్తారు.

అవుట్ డోర్ క్యాంపులు : ప్రకృతిని పరిశీలించడం, బృందంగా పని చేయడం, నాయకత్వ లక్షణాలు ఎలా అలవరచుకోవాలో నేర్పిస్తారు.

భవనంలో అగ్నిప్రమాదం

రూ.6 లక్షల నగదు బూడిదపాలు

రాజాపూర్, న్యూస్‌టుడే: ఆరుగాలం కష్టపడి, సొంతింటి నిర్మాణం కోసం సంపాదించిన సొమ్ము క్షణంలో కాలిబూడిదైంది. మొత్తం రూ.12 లక్షల విలువైన వస్తువులు, నగదు మంటలో కాలిపోయాయి. దాతలు, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు. స్థానికుల కథనం ప్రకారం.. రాజాపూర్ మండలం తిర్మలాపూర్‌కు చెందిన అజమోని పార్వతమ్మ ఇందిరమ్మ ఇల్లు నిర్మిస్తున్నారు. ఆమె కుటుంబం ముదిరాజ్ సంఘం భవనంలో ఉంటోంది. సోమవారం ఎవరూ లేని సమయంలో భవనంలో విద్యుదాఘాతం జరిగి మంటలు వ్యాపించాయి. బీరువాలోని రూ.6 లక్షల నగదు, బంగారం, వెండి ఆభరణాలు, వస్తువులు కాలిపోయాయి. మొత్తం రూ.12 లక్షల వరకు నష్టం వాటిల్లింది.

కాలిపోయిన నగదు

జ్వరాల పంజా.. పారిశుద్ధ్యం వెనకంజ

పల్లెల్లో కానరాని ఫాగింగ్ యంత్రాలు

జిల్లాలోని పంచాయతీలు	ఫాగింగ్ యంత్రాలు
423	400

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: అప్పుడప్పుడూ కురుస్తున్న వర్షాలతో మురుగు కాలువలు.. వీధుల్లో నీరు నిలుస్తోంది. దీంతో వృద్ధి చెందిన దోమలు విజృంభించడంతో పల్లె ప్రజలపై విష జ్వరాలు పంజా విసిరాయి. ఈ పరిస్థితుల్లో అవసరమైన దోమల నివారణ పరికరాలు అందుబాటులో లేకపోవడం, పారిశుద్ధ్య పనులు అంతంత మాత్రంగా ఉండటం.. పరిస్థితిని మరింత విషమం చేస్తున్నాయి. జిల్లాలోని పంచాయతీల్లో సగానికిపైగా ఫాగింగ్ యంత్రాలు మూలన పడటంతో ఫాగింగ్ అనేదే కన్పించడం లేదు. నిల్వ నీటిలో దోమల లార్వాను చంపే బాల్స్ కూడా వేయడం లేదు. కాలువల్లో సక్రమంగా మురుగు తీయడం లేదు. చాలా పల్లెల్లో డ్రైనేజీలు లేక రోడ్లపైనే మురుగు నిలుస్తోంది. ఈ క్రమంలో దోమ కాటుతో జిల్లాలో ఇటీవల డెంగీ, మలేరియా, విష జ్వరాల కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి.

బాలానగర్: పెద్దాయిపల్లి షేరిగూడెంలో ఇళ్ల మధ్య మురుగు

సిబ్బందికి వేతనాలివ్వక..

పంచాయతీల్లో తాత్కాలిక పద్ధతిన పనిచేస్తున్న మల్టీపర్పస్ పారిశుద్ధ్య కార్మికులకు చాలా మండలాల్లో రెండు నుంచి నాలుగు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. సకాలంలో వేతనాలు రాని కారణంగా పల్లెల్లో పారిశుద్ధ్య పనులు నామమాత్రంగానే జరుగుతున్నాయి. దీనికి తోడు పల్లెల్లో పారిశుద్ధ్య కార్మికుల కొరత వేధిస్తోంది.

ప్లాస్టిక్ నిషేధం.. నల్లమల సురక్షితం

అమ్రాబాద్, న్యూస్‌టుడే: పర్యావరణాన్ని దెబ్బతీస్తున్న ప్లాస్టిక్ భూతం నుంచి నల్లమలలోని వన్యప్రాణులు, జీవవైవిధ్యాన్ని కాపాడేందుకు అటవీ శాఖ చేపట్టిన చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. నల్లమలను ప్లాస్టిక్ ఫ్రీ జోన్‌గా ప్రకటించిన నేపథ్యంలో మన్ననూరు చెక్‌పోస్టు వద్ద భక్తులు, పర్యాటకుల నుంచి ప్లాస్టిక్ నీటి సీసాలు, కవర్లను సేకరించి బెయిలింగ్ సెంటర్‌కు తరలించి బెయిళ్లుగా మార్చి విక్రయిస్తున్నారు.

వన్యప్రాణులకు ముప్పు: ప్లాస్టిక్ కవర్లు, నీటి సీసాలను అడవిలో పడేయడంతో వన్యప్రాణులు, నేల ఆరోగ్యం దెబ్బతింటోంది. ప్లాస్టిక్ వ్యర్థాలను ఆహారంగా తిన్న వన్యప్రాణులు మృత్యువాత పడే అవకాశం ఉంది. నేల, నీటి వనరులు కలుషితమయ్యే ప్రమాదం కూడా ఉంది.

మన్ననూరులో బెయిలింగ్ యంత్రంలో ప్లాస్టిక్ సీసాలను వేస్తున్న సిబ్బంది

చెక్‌పోస్టు వద్దే అడ్డుకట్ట: మన్ననూరు చెక్‌పోస్టు వద్ద సిబ్బంది ప్లాస్టిక్ సేకరించడంతో పాటు అడవిలో పర్యాటకులు పడేసే ప్లాస్టిక్ సీసాలు, కవర్లను సేకరించేందుకు 16 మందిని వాచర్లను నియమించారు.

బెయిలింగ్, రీసైక్లింగ్‌కు తరలింపు: సేకరించిన చెత్త, సీసాలను ప్రత్యేక వాహనంలో మన్ననూరు బెయిలింగ్ కేంద్రానికి తరలిస్తారు. ఓ ప్రత్యేక యంత్రంలో వేసి వాటిని బెయిళ్లుగా మార్చి నిల్వ చేస్తున్నారు. కొంత మొత్తం పోగైన తర్వాత వాటిని రీసైక్లింగ్ కేంద్రాలకు విక్రయిస్తున్నారు. గడిచిన రెండేళ్లలో ఒక్కొక్కటి సుమారు 30 కిలోల బరువుండే 345 ప్లాస్టిక్ సీసాల బెయిళ్లను విక్రయించారు.

(c) eenadu

గుంత తవ్వి.. మరమ్మతులు మరిచి

పట్టణంలోని చేపల మార్కెట్‌కు వెళ్లే దారిలో మంచినీటి పైపులైన్ మరమ్మతుల కోసం అయిదు రోజుల క్రితం గుంత తవ్వి పనులు పూర్తి చేయలేదు. ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టకపోవడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు పూర్తి చేసి గుంతను పూడ్చాలని, అప్పటి వరకు భద్రతా చర్యలు తీసుకోవాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, పెబ్బేరు పట్టణం**

పట్టు వీడకు.. ప్రమాదానికి చోటివ్వకు

మహబూబ్‌నగర్ నుంచి నారాయణపేట వెళ్లాలంటే సాహసం చేయాల్సిందే. ఉదయం, సాయంత్రం బస్సులు సరిపడా లేకపోవడం, ఉన్నా అందులో నిల్చోవడానికి స్థలం దొరకకపోవడంతో ఫుట్‌బోర్డులపైనే ప్రమాదకరంగా నిలబడి ప్రయాణం సాగిస్తున్నారు. ఏ మాత్రం అదుపుతప్పినా పెను ప్రమాదం జరిగే అవకాశం ఉంది. పాలమూరు నగరంలో సోమవారం తీసిన చిత్రమిది. **- న్యూస్‌టుడే, నవాబ్‌పేట, కార్పొరేషన్**

సస్యరక్షణతో వేరుసెనగలో అధిక దిగుబడి



కొన్నూరులో సాగైన వేరుసెనగ

మదనాపురం, న్యూస్‌టుడే : జిల్లాలో ఆయా ప్రాంతాల్లో రైతులు ఆరుతడి పంట కింద యాసంగిలో వేరుసెనగ సాగు చేస్తారు. కలుపు, చీడపీడల నివారణకు యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని మదనాపురం కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త, కీటక శాస్త్రవేత్త డాక్టర్ రాజేందర్ రెడ్డి తెలిపారు. టీఏజీ 24, కదిరి 6, కదిరి 9, లేపాక్షి, హరితాంధ్ర, ధరణి, జేల్ 24, జగిత్యాల పల్లీ 1, టీసీజీఎస్ 1694, గిర్‌నారు-3 గిర్‌నారు-4 అధిక దిగుబడికి అనువైన రకాలని పేర్కొన్నారు. సెప్టెంబరు రెండో వారం నుంచి నవంబరు మొదటి వారం వరకు విత్తనాలు విత్తుకోవచ్చు. 22 సెం.మీ.× 10 సెం.మీ. దూరంలో ఎకరాకు 4.4 లక్షల మొక్కలు ఉండేలా చూసుకోవాలని సూచించారు.

విత్తనశుద్ధి : టెబ్యూకోనోజోల్ 2డీఎస్ మందును ఒక గ్రాము లేదా మ్యాంకోజెబ్ 3 గ్రా. కిలో విత్తనానికి కలిపి విత్తనశుద్ధి చేసుకొని ఆపై ట్రైకోడర్మా 10 గ్రా., అనంతరం రైజోబియం 5 గ్రా. విత్తనం వేసే 2 గంటల ముందు కలిపి విత్తుకోవాలి.

పోషకాల యాజమాన్యం: భాస్వరం, పొటాష్ ఎరువులను విత్తే సమయంలోనే వేసుకోవాలి. ఎకరానికి 100 కిలోల సూపర్ ఫాస్ఫేట్, 33 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్, 18 కిలోల యూరియాను విత్తే సమయంలో వేసుకోవాలి. పంట పూత, ఊడలు దిగే సమయంలో 200 కిలోల జిప్సం మొదళ్ల దగ్గర వేయాలి. విత్తిన 30 రోజుల తర్వాత తొలిపూత దశలో ఎకరానికి 10 లేదా 12 కిలోల యూరియా చల్లాలి.

కలుపు పద్ధతి.. : విత్తిన వెంటనే లేదా 2 రోజుల లోపు కలుపు నివారణకు అలాక్లోర్ ఒక లీటరు లేదా పెండిమిథాలిన్ 1.3 లీటరు ఎకరానికి 200 లీటర్ల నీటిని కలిపి నేలపై పిచికారీ చేయాలి. గడ్డిజాతి మొక్కలు అధికంగా ఉంటే నివారణకు క్విజలోఫాప్.పి.ఇథైల్ ఎకరాకు 400 మి.లీ. లేదా ప్రోపాక్విజఫాస్.పి.ఇథైల్ ఎకరాకు 250 మి.లీ. విత్తిన 20 రోజుల వరకు పిచికారీ చేసుకోవచ్చు. వెడల్పాకు, గడ్డిజాతి కలుపు 2, 3 ఆకుల దశలో ఉన్నప్పుడు ఇమాజిథపైర్ 10 శాతం ఎకరాకు 300 మి.లీ లేదా ఇమాజామాక్స్+ఇమాజిథపైర్ 40 గ్రాముల కలుపు మందు ఎకరానికి 200 లీటర్ల నీటిని కలిపి పిచికారీ చేయాలి.

చీడపీడలు.. : రసం పీల్చు పురుగు నివారణకు ఫ్రిపోనిల్ 2 మి.లీ. లేదా థయోమిథాక్సామ్ 0.4 గ్రా. లేదా ఇమిడాక్లోఫిడ్ 0.3 మి.లీ. లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పొగాకు లద్దెపురుగు నివారణకు మొదటిదశలో 5 మి.లీ. వేప మందు (ఎన్ఎస్‌కేఈ)ను క్లోరోపైరిఫాస్ 50 ఈసీ 1.5 మి.లీ. లేదా న్యూవులురాన్ 1 మి.లీ. లేదా ఫ్లూబెండమైడ్ 0.2 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. మందులను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. టిక్కా ఆకుమచ్చ, కాండం కుళ్లు నివారణకు క్లోరోథానిల్ 2 గ్రా. లేదా హెక్సాకోనాజోల్ 2 మి.లీ. లేదా టెబ్యూకోనోజోల్ 1 మి.లీ. లేదా టెబ్యూకోనోజోల్+ ట్రైఫ్లాక్సిస్ట్రోబిన్ ఒక గ్రాము మందును ఏదైనా ఒకటి లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తే ఫలితం ఉంటుంది.

సాగులో.. సమస్యలా?

బిజినేపల్లి, న్యూస్‌టుడే : సాగులో యాజమాన్య పద్ధతులపై అన్నదాతలు ఆదివారం మినహా మిగతా రోజుల్లో ఉదయం 11-12 గంటల మధ్య చరవాణి నంబరు 99514 61694ను సంప్రదిస్తే సందేహాలు నివృత్తి చేస్తామని కృషి విజ్ఞాన కేంద్రం కీటక శాస్త్రవేత్త డా.శైల తెలిపారు.

రైతేరాజు

పశువుల పేడ ఎంత వాడాలి?

మీ కోసం

హన్వాడ, న్యూస్‌టుడే : ఎకరానికి పశువుల పేడ ఎంత వాడాలో చాలా మంది రైతులకు తెలియదు. రూ.వేలు ఖర్చు చేసి ట్రాక్టర్ల కొద్దీ పొలాల్లో వేయడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండటం లేదు. ఎలాంటి రసాయన మందులు చల్లని రైతులు ఎకరానికి 100 కిలోల జల్లెడ పట్టిన పశువుల ఎరువు వాడితే సరిపోతుంది. దీన్ని కల్చర్ మాదిరిగా ఉపయోగిస్తే మంచి ఫలితాలు ఉంటాయి. పశువుల ఎరువును పెంటకుప్ప నుంచి తీసి ఏడు రోజుల పాటు ఆరబెట్టి జల్లెడ పట్టాలి. వానాకాలం, యాసంగిలో విత్తనాలు విత్తేటప్పుడు వేసుకుంటే సరిపోతుంది. దీంతో పాటు పొడిగా ఉండే ఘనజీవామృతాన్ని కలిపి విత్తుకోవచ్చు.

పురుగుల నివారణలో జిగురు అట్టల పాత్ర కీలకం

బిజినేపల్లి, న్యూస్‌టుడే : లింగాకర్షక బుట్టలు, జిగురు అట్టలు ఉపయోగించి ఎరువుల వినియోగం తగ్గిస్తూ, పంటకు హాని చేసే కీటకాలు, కాయతొలిచే పురుగును అరికట్టవచ్చని కేవీకే కీటక శాస్త్రవేత్త డా.శైల తెలిపారు.

ఇలా చేయాలి.. : అన్ని రకాల పంటలకు ఆశించే పచ్చదోమ, తెల్లదోమ, పేనుబంక పురుగులను పసుపురంగు అట్టలు ఆకర్షిస్తాయి. ముఖ్యంగా కూరగాయల పంటల సాగులో వీటిని వినియోగించవచ్చు. ఎకరానికి 20-25 అమర్చుకోవాలి. వివిధ రకాల పంటలకు ఆశించే ఎర్ర నల్లి, తెల్ల నల్లి, తామర పురుగు నివారణకు నీలి రంగు అట్టలు వాడవచ్చు. ఎకరానికి 20 -25 అమర్చుకోవాలి. తెలుపు రంగు జిగురు అట్టలను రసం పీల్చే పురుగులు, తామర పురుగు నివారణకు వాడవచ్చు. ఎకరానికి 20-25 అమర్చుకోవాలి

లింగాకర్షక బుట్టలు : కాయ తొలుచు పురుగుల నివారణకు వీటిని వాడతారు. వీటి వల్ల మగ పురుగులు ఆకర్షితమై, సంతతి గణనీయంగా తగ్గుతుంది. వీటిని ప్రతి 21 రోజులకు ఒకసారి మార్చడం వల్ల మగ పురుగులను ఆశించే సామర్థ్యం పెరుగుతుంది. ● పురుగుల ఉద్ధృతిని గమనించడానికి ఎకరానికి 4-5 బుట్టలు అమర్చుకోవాలి. 10-20 బుట్టలు అమర్చుకోవడం ద్వారా కొంత మేర పురుగును నివారించవచ్చు. 50-60 శాతం నివారణకు లేదా పరాగసంపర్కాన్ని నిరోధించడానికి ఎకరానికి 100-120 బుట్టలు అమర్చుకోవాలి. పంటల ఎత్తు పెరిగే కొద్దీ వీటి ఎత్తు పెంచుకోవాలి.

ప్రశ్నలు - సమాధానాలు

? వరిలో కాండం తొలిచే పురుగు నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి? **- శివకుమార్, పెబ్బేరు**

✔ నారు నాటిన 15 రోజుల తర్వాత ఎకరానికి 4 కిలోల క్లోరాంట్రనిలిప్రోల్ గుళికలు వేయాలి.

? కందిలో ఆకులపై పురుగులు గూడు పెడుతున్నాయి. వాటి ఎలా నివారించాలి? **- నిరంజన్ యాదవ్, చేగుంట**

✔ కందిలో ఆకుగూడు నివారణకు 2 మి.లీ. క్లోరిపైరిఫాస్ ద్రావణాన్ని లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తే ఆకు గూడును అరికట్టవచ్చు.

? జొన్నలో మొవ్వ తొలుచు పురుగు ఆశించింది. నివారణ ఎలాంటి చర్యలు చేపట్టాలి? **- రామాంజనేయులు, మమ్మాయిపల్లి**

✔ జొన్న శాఖీయ దశలో మొవ్వతొలుచు పురుగును గమనిస్తే 1.0 మి.లీ. సైపర్‌మెత్రిన్ ద్రావణానికి లీటరు నీటిని కలిపి పిచికారీ చేయాలి.

(కేవీకే కీటక శాస్త్రవేత్త డా.శైల సమాధానాలిచ్చారు)

- న్యూస్‌టుడే, బిజినేపల్లి

ఆర్టీసీలో అవిశ్రాంత పోరాటం!

● ప్రయోజనాలు అందక ఏళ్లుగా నిరీక్షణ

● ఆర్థిక ఇబ్బందుల్లో అల్లాడుతున్న వైనం

మహబూబ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: ఆర్టీసీలో ఉద్యోగ విరమణ పొందిన వారిని కుటుంబ సభ్యులు ఓ విషయంలో ఎప్పుడూ తప్పుబడుతుంటారు. ఏ కాస్త సమయం దొరికినా డిపోల వద్దకు చేరి ఆర్టీసీ బాగోగుల గురించి ఎందుకు చర్చిస్తుంటారని ప్రశ్నిస్తుంటారు. విశ్రాంత జీవితంలోనూ సంస్థ గురించి తపన పడే వారిప్పుడు ఉద్యోగ విరమణ ప్రయోజనాలు దక్కక కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి నెలకొంది.

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పది ఆర్టీసీ డిపోల పరిధిలో ప్రతి నెలా సగటున 25 నుంచి 30 మంది (డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు, ఇతర సిబ్బంది) ఉద్యోగ విరమణ చేస్తున్నారు. వీరికి నెలలు గడుస్తున్నా విశ్రాంత ప్రయోజనాలు అందడం లేదు. ఒక్కో ఉద్యోగికి సగటున రూ.20 లక్షలకు పైబడే అందాల్సి ఉంది. ఈ డబ్బులు చేతికి ఎప్పుడు అందుతాయోనని విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగులు మహబూబ్‌నగర్‌లోని ఆర్ఎం కార్యాలయం చుట్టూ రోజూ చెప్పులరిగేలా తిరుగుతుంటారు.

ఉచిత పథకాల పుణ్యమా అంటూ..: ప్రభుత్వాలు ఉచిత పథకాలు అమలు చేస్తున్న కారణంగా బడ్జెట్ లేక ఆయా ప్రభుత్వ, ప్రభుత్వరంగ సంస్థల్లో ఉద్యోగ విరమణ చేసే తమకు సకాలంలో ప్రయోజనాలను ఇవ్వలేకపోతున్నాయని ఆరోపిస్తున్నారు. ఈ పరిస్థితి ఆర్టీసీలోనే కాదూ ప్రతి శాఖలోనూ ఎదురవుతోందంటున్నారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు ఆర్టీసీలో ఉద్యోగ విరమణ చేసిన వారికి మూడు నుంచి ఆరు మాసాల్లోగా రిటైర్డ్ బెనిఫిట్స్ వచ్చేవి. ఆ తర్వాత ఈ గడువు ఏడాదికి పెరిగింది. కాలక్రమేణా ఇది రెండు నుంచి మూడేళ్లకు చేరడంతో ఆర్టీసీ విశాంత్ర ఉద్యోగుల కుటుంబాల్లో ఆందోళన నెలకొంది.

సర్వీసు నిబంధనల ప్రకారం: ప్రభుత్వ, ప్రభుత్వరంగ సంస్థల్లో పనిచేసి ఉద్యోగ విరమణ చేసే వారికి వారం ముందే ప్రయోజనాలు (పీఎఫ్, గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, డీఏ, పీఆర్సీ ఎరియర్స్) ఖాతాల్లో జమ చేయాలి.

కుమార్తె పెళ్లికి అప్పు చేశా

2024 నవంబర్‌లో ఆర్టీసీ గద్వాల డిపోలో ఏడీసీ కంట్రోలర్‌గా ఉద్యోగ విరమణ చేశా. 20 మాసాలు గడుస్తున్నా రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వలేదు. రూ.20 లక్షలకు పైగా నాకు రావాలి. చేతిలో డబ్బు లేకపోవడంతో అప్పు చేసి కుమార్తె పెళ్లి చేయడంతో ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టాయి. ఆర్ఎం కార్యాలయం చుట్టూ తిరిగినా ఫలితం లేదు. **- కె.సుధాకర్‌రెడ్డి, విశ్రాంత కంట్రోలర్, పుట్టపల్లి**

పెళ్లీడుకొచ్చిన ఆడపిల్లలున్నారు.. కనికరించాలి

మహబూబ్‌నగర్ డిపోలో ఐదు నెలల కిందట ఉద్యోగ విరమణ చేశా. 2017, 2021 సంవత్సరాల పీఆర్సీ బకాయిలతో పాటు డీఏ ఎరియర్స్, గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ డబ్బులు రావాల్సి ఉంది. ఇద్దరు అమ్మాయిల పెళ్లిళ్లు చేద్దామని భావిస్తే ఇంత వరకు ఆర్టీసీ నుంచి ప్రయోజనాలు రావడం లేదు. కుటుంబ పోషణ భారంగా ఉంది. విశ్రాంత ఉద్యోగులపై కక్ష సాధించకుండా వెంటనే ఇవ్వాలి. **- ఎస్.సుగుణమ్మ, విశ్రాంత కండక్టర్**

రూ. 20 లక్షల వరకు రావాలి

మహబూబ్‌నగర్ డిపోలో డ్రైవర్‌గా చేస్తూ ఉద్యోగ విరమణ చేశా. రూ.20 లక్షల వరకు ప్రభుత్వం నుంచి రావాలి. ఇప్పుడు అప్పుడంటూ ఎదురుచూడటం తప్ప ఇవ్వడం లేదు. అప్పు చేసి బిడ్డ పెళ్లి చేశా. అప్పుల వాళ్లు ఇంటి చుట్టూ తిరుగుతున్నారు. ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేకపోతున్నా. **- కె.శ్రీనివాసులు, విశ్రాంత డ్రైవర్**

మా డబ్బు మాకు ఇప్పించండి సార్..

సోషల్ మీడియాలో ప్రకటన చూసి మోసపోయాం

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే: స్క్రబ్ ఎక్స్ పేరుతో రమేష్ అనే వ్యక్తి, మరికొందరు మోసం చేసి డబ్బు తీసుకుని బోర్డు తిప్పేశారు.. ఈ కేసులో నిందితుడు తిరుమలకొండ రమేష్‌ను పోలీసులు అరెస్టు చేశారు.. అతడి నుంచి తమకు రావాల్సిన డబ్బు ఇప్పించాలని మదనపల్లె, పీలేరు, వాల్మీకిపురం, శ్రీ సత్యసాయిజిల్లా, అనంతపురం, మహబూబ్‌నగర్ ప్రాంతాలకు చెందిన స్క్రబ్ ఎక్స్ బాధితులు విన్నవించారు. ఆంధ్రప్రదేశ్‌లోని అన్నమయ్య జిల్లా కేంద్రమైన మదనపల్లెలో సోమవారం నిర్వహించిన పోలీసు పీజీఆర్ఎస్‌లో ఎస్పీ ధీరజ్‌కు వారు ఫిర్యాదు చేశారు.. తాము సోషల్ మీడియాలో వచ్చిన ప్రకటన చూసి మోసపోయామని వాపోయారు. డబ్బు కట్టామని నిందితుడితో పాటు సంబంధిత పోస్టు పెట్టిన సోషల్ మీడియా నిర్వాహకులపైనా చర్యలు తీసుకోవాలని వారు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

అర చేతిలో పల్లె ప్రగతి

కొత్తకోట గ్రామీణం, న్యూస్‌టుడే : గ్రామ పంచాయతీలకు సంబంధించిన ఏ సమాచారమైనా ఒక్క క్లిక్‌తో తెలుసుకోవచ్చు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు సంయుక్తంగా 'జీపీ ప్రొఫైల్' (జీపీఎస్‌ఏపీ) అనే వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తెచ్చాయి. రాష్ట్రంలోని అన్ని పంచాయతీల సమగ్ర సమాచారాన్ని అభివృద్ధి పనులు, ప్రణాళికలను పారదర్శకంగా నిర్వహించడానికి ఈ వెబ్‌సైట్‌ను రూపొందించారు. పంచాయతీకి సంబంధించిన ప్రతి అంశాన్ని డిజిటలైజ్ చేశారు. ఈ పోర్టల్‌లో పల్లెలకు సంబంధించిన పూర్తి వివరాలు చూడటానికి చరవాణి లేదా అంతర్జాలంలోని గూగుల్ క్రోమ్‌ను తెరిచి https://gpsap&prrd.telangana.gov.in/gpprofile లింక్‌ను ఓపెన్ చేయాలి.

జిల్లాల వారీగా పంచాయతీల వివరాలు	
వనపర్తి	268
మహబూబ్‌నగర్	423
నాగర్‌కర్నూలు	460
నారాయణపేట	272
జోగులాంబ గద్వాల	255

వెబ్ పేజీలో సమగ్ర సమాచారం: పేజీని తెరిచిన వెంటనే జిల్లా, మండలం, పంచాయతీ కోడ్ నమోదు చేస్తే అందులో ప్రజాప్రతినిధులు, కార్యదర్శి వివరాలతో పాటు పంచాయతీలో ఉన్న జనాభా (స్త్రీ, పురుషులు), గృహాల సంఖ్య పొందుపరిచారు. వీటితో పాటు సీసీ రహదారులు, మురుగు కాల్వలు, వీధి దీపాలు, తాగునీటి కనెక్షన్లు, డంపింగ్ యార్డు, వైకుంఠ ధామాలు, పల్లె ప్రకృతి వనం, సెగ్రిగేషన్ షెడ్, ట్రాక్టర్ లభ్యత, పంచాయతీ అధీనంలో ఉన్న భవనాలు, స్థలాలు, కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంఘాల నిధుల వినియోగం, తదితర అంశాలను వెబ్ పేజీలో అందుబాటులో ఉన్నాయి.

ఆరోగ్యానికి క్రీడలు దోహదం

పీయూ వీసీ శ్రీనివాస్

క్రికెట్ ఆడుతున్న వీసీ జీఎన్ శ్రీనివాస్

పాలమూరు, న్యూస్‌టుడే: అధ్యాపకులు, సిబ్బంది నిత్యం ఏదో ఒక క్రీడ ఆడుతూనే ఉండాలని, అప్పుడు ఆరోగ్యంగా, ఉత్సాహంగా ఉండేందుకు అవకాశం ఉంటుందని పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు స్థానిక పీయూలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో యూనివర్సిటీ టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందికి పలు క్రీడాపోటీలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల మధ్య స్నేహభావం, సమన్వయం పెంపొందడానికి ఇటువంటి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని సూచించారు. ఈ క్రీడా పోటీలు సోమవారం నుంచి గురువారం వరకు జరుగుతాయన్నారు. వీసీ, ఓఎస్డీ జట్ల మధ్య జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో వీసీ జట్టు 60 పరుగుల తేడాతో గెలుపొందింది. కార్యక్రమంలో పీయూ రిజిస్ట్రార్ రమేశ్‌బాబు, ఓఎస్డీ మధుసూదన్‌రెడ్డి, అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ చంద్రకిరణ్, పీడీ శ్రీనివాసులు, పలు విభాగాల అధ్యాపకులు నాగం కుమారస్వామి, రాజ్‌కుమార్, ఈశ్వర్‌కుమార్, రవికుమార్, అర్జున్‌కుమార్, రాజశేఖర్, శ్రీనివాస్, గాలెన్న, సుస్మిత, చిన్నాదేవి, ప్రభాకర్‌రెడ్డి, జ్ఞానేశ్వర్, రంగప్ప పాల్గొన్నారు.

316 మెగావాట్ల విద్యుదుత్పత్తి

ఆత్మకూరు(అమరచింత), న్యూస్‌టుడే : జూరాల ప్రాజెక్టుకు కర్ణాటక నుంచి వరద రావడంతో సోమవారం 8 టర్బయిన్ల ద్వారా విద్యుదుత్పత్తి చేపట్టారు. ఎగువన 4, దిగువన 4 యూనిట్లలో 316 మెగావాట్ల ఉత్పత్తి జరిగిందని ఎస్ఈ శ్రీధర్ తెలిపారు. పవర్ హౌస్ ద్వారా 21,324 క్యూసెక్కుల నీరు వదులుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఆలయ సమాచారం

అలంపూర్, న్యూస్‌టుడే: అలంపూర్ బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయం ఉదయం 6.00 గంటలకు, జోగులాంబ అమ్మవారి ఆలయం ఉదయం 6.30కు తెరుస్తారు. స్వామి వారి ఆలయంలో ఉదయం 7.30 నుంచి 11 గంటల వరకు అభిషేకం, అర్చనలు, స్పర్శ దర్శనం, ఉదయం 9 నుంచి 11 గంటలకు రేణుక ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు, 11.30 నుంచి 12 గంటల వరకు నివేదన, మహా మంగళహారతి ఉంటాయి. మధ్యాహ్నం 1 నుంచి 2 గంటల వరకు ఆలయాలు మూసివేస్తారు. తిరిగి మధ్యాహ్నం 2 నుంచి 4 వరకు అభిషేకం, అర్చనలు, స్పర్శ దర్శనం, రాత్రి 7.30 గంటలకు మహా మంగళహారతి. జోగులాంబ ఆలయంలో ఉదయం 7.30 నుంచి 10.30 గంటల వరకు త్రిశతి అర్చన, మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు ఖడ్గమాల అర్చనలు కొనసాగుతాయి. రాత్రి 7కు మహా మంగళహారతి అనంతరం రాత్రి 8.30 గంటలకు ఆలయాలు మూసివేస్తారు.



గంజాయి సరఫరా చేస్తున్న ఇద్దరి అరెస్టు

వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మొగులయ్య

గద్వాల కలెక్టరేట్, న్యూస్‌టుడే: గద్వాల జిల్లా కేంద్రంలో ఆదివారం తొలిసారి పెద్ద ఎత్తున గంజాయి పట్టుబడిన విషయం తెలిసిందే. సోమవారం డీఎస్పీ మొగులయ్య పట్టణ పోలీసు స్టేషన్‌లో సీఐ శ్రీనుతో కలిసి వివరాలు వెల్లడించారు. ఇటిక్యాల మండలానికి చెందిన బోయ బీసన్న(50), మల్దకల్ మండలానికి చెందిన తనగల గోకారి (29) గంజాయిని సరఫరా చేస్తుండగా పోలీసులకు సమాచారం అందింది. గద్వాల వ్యవసాయ మార్కెట్ యార్డు సమీపంలో వారిని పట్టుకొని 5.057 కేజీల 10 ప్యాకెట్ల గంజాయితో పాటు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితులు ఇద్దరు తమ భూముల్లో పంటల సాగుతో పాటు గంజాయి మొక్కలు పెంచి వాటిని ఎండబెట్టి గద్వాల, ఎర్రవల్లి, కొత్తకోట ప్రాంతాల్లో విక్రయించేందుకు తరలిస్తున్నారని పేర్కొన్నారు. ఈ క్రమంలో ద్విచక్ర వాహనంపై గద్వాలకు వస్తున్నారన్న సమాచారంతో పట్టుకున్నట్లు వివరించారు. ఇద్దరిపై ఎన్‌డీపీఎస్ చట్టంలోని పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశామన్నారు. సమావేశంలో పట్టణ ఎస్సై కల్యాణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎస్సైని సస్పెండ్ చేయాలని భాజపా ధర్నా

ఎస్పీ కార్యాలయానికి ఎస్సై అటాచ్

కోడేరు, న్యూస్‌టుడే: యువకుణ్ని ఠాణాకు పిలిపించి ఎస్సైతో పాటు నలుగురు కానిస్టేబుళ్లు కొట్టిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో చోటుచేసుకున్న పరిణామాలు కోడేరు ఎస్సైని ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేసేవరకు వెళ్లాయి. బాధితుడితో పాటు భాజపా నేతలు, గ్రామస్థులు సోమవారం ధర్నా నిర్వహించడంతో మండల కేంద్రంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. బాధితుడు, గ్రామస్థుల కథనం ప్రకారం. . మండలంలోని ఠాకూర్‌తండాకు చెందిన డా.పరమేశ్వర్, నార్యానాయక్‌తండాకు చెందిన పాండునాయక్ వ్యక్తిగతంగా సోషల్ మీడియాలో విమర్శలు చేసుకున్నారు. దీంతో పాండునాయక్ కోడేరు ఠాణాలో పరమేశ్వర్‌పై ఫిర్యాదు చేశారు. పరమేశ్వర్‌ను ఆగస్టు 28న విచారణకు ఠాణాకు పిలిపించి ఎస్సై వేణుగోపాల్, కానిస్టేబుళ్లు కొట్టారు. గాయపడిన బాధితుడు తండా ప్రజలు, భాజపా నాయకుడు ఎల్లేని సుధాకర్‌రావుకు మొరపెట్టుకున్నారు. అంతకు ముందే డీజీపీకి ఫిర్యాదు చేశారు. పోలీసుల తీరుకు నిరసనగా సోమవారం భాజపా నాయకులతో ఠాణాకు పాదయాత్రగా వెళ్లారు. కొల్లాపూర్ సీఐ శంకర్, ఎస్సై, సిబ్బందితో వారిని అడ్డుకోగా రోడ్డుపై బైఠాయించారు. ఈ విషయంలో 'న్యూస్‌టుడే' డీఎస్పీ శ్రీనివాస్ యాదవ్‌ను వివరణ కోరగా ఎస్సై వేణుగోపాల్‌పై గతంలోనే పలు ఆరోపణలు వచ్చాయన్నారు. తాజా ఆరోపణలతో ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేసినట్లు వివరించారు. విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు. కొల్లాపూర్ సీఐ శంకర్.. కోడేరు ఠాణా బాధ్యతలు చూస్తారని, త్వరలోనే మరో ఎస్సైని నియమిస్తామన్నారు.

కేసుల దర్యాప్తును వేగవంతం చేయండి

మల్టీజోన్-2 ఐజీ షానవాజ్ ఖాసీం

దస్త్రాలు పరిశీలిస్తున్న మల్టీజోన్-2 ఐజీ షానవాజ్ ఖాసీం, ఎస్పీ జానకి

భూత్పూర్, న్యూస్‌టుడే: పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని మల్టీజోన్-2 ఐజీ షానవాజ్ ఖాసీం సూచించారు. భూత్పూర్ సర్కిల్ కార్యాలయాన్ని ఎస్పీ జానకితో కలిసి సోమవారం తనిఖీ చేశారు. ఠాణాలను నిరంతరం పర్యవేక్షిస్తూ, సిబ్బందిని అప్రమత్తం చేయాలని అన్నారు. వివిధ ఠాణాల దస్త్రాలు పరిశీలించి నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, మాదక ద్రవ్యాల నియంత్రణకు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ రామకృష్ణ, ఎస్సైలు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నియంత్రణకు సమష్టి కృషి

సూచనలు చేస్తున్న రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ జేడీ జయలక్ష్మి

పాలమూరు, న్యూస్‌టుడే: జిల్లాలో ఎయిడ్స్‌ను పూర్తిగా నిర్మూలించడానికి సమష్టి కృషి అవసరమని, లక్ష్య సాధనకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ జేడీ డా.జయలక్ష్మి వైద్యాధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం స్థానిక ప్రభుత్వ జనరల్ ఆసుపత్రితో పాటు పలు ప్రాంతాలను ఆమె పరిశీలించారు. తల్లి నుంచి బిడ్డకు హెచ్ఐవీ సంక్రమణ నివారణ (పీపీటీసీటీ) సేవలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎయిడ్స్ బాధితులు మహబూబ్‌నగర్ జీజీహెచ్‌లోని ఏఆర్‌టీ సెంటర్‌కు వస్తున్నారని, వారికి నాణ్యమైన వైద్యసేవలతో పాటు సలహాలు, సూచనలు అందించాలన్నారు. జిల్లాలో హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమాలను మరింత సమర్థంగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్, కుష్ఠు విభాగ అధికారి రాజు, డా.ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

EENADU Classifieds

REAL ESTATE

FLAT FOR SALE

మహబూబ్‌నగర్ భగీరథకాలనీ నర్సరీ బజార్ మినీ అపార్ట్‌మెంట్ నందు 66 గజాల ఈస్ట్ ఫేస్ ఫ్లాట్ అమ్మకానికి కలదు. సంప్ర: 9704209449

JOBS

Required Female Typist for Jaya Diagnostic Centre, Club Road, Jadcherla, Behind M.R.O office, fast typing skills required English Language, Salary as per experience.... Jaya Diagnostic Centre, Club Road, Jadcherla. Contact Number : 99665 02502

Book Your 5 Lines Classified Advertisement for
B&W Rs. 335/- Only
Colour Rs. 395/- Only
GST 5% Extra
For further details Contact : Mahabubnagar 8008709794

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్ - లిస్టులో ఉంచే మరియు / లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 8008709794
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 8008001824

మేమున్నాం.. మీకు తోడుగా.. ఉ.10గం. నుంచి మ.1 వరకు
మహబూబ్‌నగర్: 8008333816 | భూత్పూర్: 8686783574
బాలానగర్: 9705983863 | దేవరకద్ర: 9000031648
జడ్చర్ల: 8008573899, 8008573901

? నగరంలో బోయపల్లికి వెళ్లే దారి తవ్వుగుట్టకు మంచినీరు రావడం లేదు. – సుజన్య, స్వాతి వీరాలు ✔ పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. – గోపాల్, కార్పొరేషన్ ఏఈ
? పాలమూరు నగరంలోని రాజేంద్రనగర్ శెట్టిగారిపల్లె ఎదురుగా గుంతల రహదారితో ఇబ్బంది పడుతున్నాం. – శేఖర్, ప్రయాణికుడు
✔ మరమ్మతు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. – సుస్మిత, కార్పొరేషన్ ఏఈ
? పాతపాలమూరులో డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేదు. – నవీన్, స్థానికుడు ✔ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. – సుస్మిత, కార్పొరేషన్ ఏఈ
? కోయిలకొండ మండలం అంకిళ్ల పెద్దవాగుపై వంతెన నిర్మించాలి. రవి, కల్వాకుర్తి తండా ✔ త్వరలో పనులు ప్రారంభిస్తాం. – మధుసూదన్, ఏఈ ? దేవరకద్ర మండలం బస్వాపూర్ రహదారి గుంతలమయంగా మారింది. – రాంరెడ్డి ✔మరమ్మతులు చేస్తాం. – రాఘవేంద్ర, ఏఈ, దేవరకద్ర
మెట్టుగడ్డ (మహబూబ్‌నగర్), కోయిలకొండ, దేవరకద్ర, న్యూస్‌టుడే

ఉత్కంఠకు తెర

జిల్లా పోలీసు అధికారుల సంఘం ఎన్నిక

టాస్‌తో గెలిచిన ఏఆర్‌డీసీ సురేశ్

ఎస్పీ జానకిని కలిసిన నూతన పోలీసు అధికారుల సంఘం సభ్యులు

మహబూబ్‌నగర్ నేరవిభాగం, న్యూస్‌టుడే: పోలీసు అధికారుల సంఘం జిల్లా ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. స్థానిక పోలీసు ప్రధాన కార్యాలయంలో ఐదు పోస్టులకు జరిగిన ఎన్నికలకు అదనపు ఎస్పీ ఎన్‌బీ రత్నం ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. 29 మంది ప్రతినిధులు ఓటుహక్కును వినియోగించుకున్నారు. పది మంది పోటీ పడగా.. సివిల్, ఏఆర్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు ఐదుగురు ఎన్నికయ్యారు. ఉత్కంఠంగా సాగిన ఈ ఎన్నికల్లో ఒకరు టాస్‌తో విజయం సాధించారు.

● సివిల్ ఎగ్జిక్యూటివ్ మూడు పోస్టులకు ఆరుగురు పోటీ పడగా.. రవీందర్ (భూత్పూర్ పీసీ)కు 21 ఓట్లు, ఎల్.రాజేశ్వర్‌రెడ్డి (పోలీస్ కంట్రోల్ రూం పీసీ)కి 19 ఓట్లు, ఎ.రవికుమార్ (కోయిలకొండ హెచ్‌సీ)కు 17 ఓట్లతో విజయం సాధించారు.

● ఏఆర్ ఎగ్జిక్యూటివ్ రెండు పోస్టులకు నలుగురు పోటీ పడ్డారు. వీరిలో పోతురాజు యాదయ్య (ఏఆర్ హెచ్‌సీ)కి 18 ఓట్లు, బీమానాయక్ (ఏఆర్‌పీసీ)కి 15, టి.సురేశ్ (ఏఆర్‌డీసీ)కి 15 ఓట్లు వచ్చాయి. ఇద్దరికి సమానంగా ఓట్లు రావడంతో టాస్ వేయగా అదృష్ట లక్ష్మి టి.సురేశ్‌ను వరించింది.

● **నూతన సంఘ జాబితా:** ఆరేళ్ల తర్వాత నూతన పోలీస్ అధికారుల సంఘం ఏర్పడింది. నూతన సంఘం జిల్లా అధ్యక్షుడిగా సురేశ్ (ఎస్‌బీ), ఉపాధ్యక్షులుగా అశోక్‌కుమార్ (ఆర్‌ఐ), వెంకటేశ్ (హన్వాడ ఎస్సై), కార్యదర్శిగా అప్పయ్య (వన్‌టౌన్ సీఐ), సంయుక్త కార్యదర్శిగా పవన్‌కుమార్ గౌడ్ (ఎం.నగర్ రూరల్ కానిస్టేబుల్), సమన్వయ కార్యదర్శిగా యాదగిరయ్య గౌడ్ (ఏఆర్ ఎస్సై), కోశాధికారిగా బి.శేఖర్ (రెండో పట్టణ ఠాణా హెచ్‌సీ), ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా పద్మ (రెండో పట్టణ ఠాణా పీసీ), సివిల్ ఎగ్జిక్యూటివ్‌గా రవికుమార్ (హెచ్‌సీ, కోయిలకొండ), రామచందర్ (భూత్పూర్ పీసీ), రాజేశ్వర్‌రెడ్డి (పీసీఆర్ పీసీ), ఏఆర్ ఎగ్జిక్యూటివ్‌లుగా పోతురాజు యాదయ్య (ఏఆర్‌హెచ్‌సీ), టి.సురేశ్ (ఏఆర్‌డీసీ) తదితరులు ఎన్నికయ్యారు. వీరు మూడేళ్ల పాటు అధికారంలో ఉంటారు. వారే జిల్లాలో పని చేస్తున్న 800 మంది పోలీసు అధికారులు, సిబ్బందికి వారధిగా పని చేస్తారు.

ఎస్పీని కలిసిన నూతన కార్యవర్గం

జిల్లా పోలీసు అధికారుల సంఘం నూతన కార్యవర్గ సభ్యులు ఎస్పీ డి.జానకిని మర్యాదపూర్వకంగా కలిశారు. అదనపు ఎస్పీ ఎన్‌బీ రత్నం ఎన్నికల విధివిధానాలు, గెలిచిన అభ్యర్థుల వివరాలను ఎస్పీకి వివరించారు. నూతన జిల్లా కార్యవర్గ సభ్యులను ఎస్పీ అభినందించారు.

లోక్ అదాలత్‌తో అత్యధిక కేసుల పరిష్కారం

మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ఇందిర

పాలమూరు, న్యూస్‌టుడే: జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి డి.ఇందిర అన్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని కోర్టు ఆవరణలో బ్యాంకు మేనేజర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. బ్యాంక్ ప్రీ లిటిగేషన్ కేసులను ఈ నెల 12న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించేలా కృషి చేయాలని సూచించారు. జాతీయ లోక్ అదాలత్‌లో రాజీమార్గం ద్వారా త్వరితగతిన పరిష్కరించుకోవచ్చన్నారు. దీనివల్ల ఇరుపక్షాలకు సమయం, ఖర్చు ఆదా అవుతుందన్నారు.

ఉపకార వేతనాలు చెల్లించాలని డిమాండ్

నిరసన తెలుపుతున్న ఏబీవీపీ నాయకులు

జడ్చర్ల పట్టణం, న్యూస్‌టుడే: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు చెల్లించాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కురుమూర్తి డిమాండ్ చేశారు. సోమవారం జడ్చర్లలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి మాట్లాడారు. రాష్ట్రంలో 20 లక్షల మంది విద్యార్థులు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలపై ఆధారపడి చదువుతున్నారని అన్నారు. సాయికుమార్, నవీన్, మహేందర్, సాయి, రఘు, కార్తిక్, మోహన్, చందు, అనిల్, రవీందర్ పాల్గొన్నారు.

తెరపై ఈనాడు

మహబూబ్‌నగర్‌లో.. శ్రీనివాస - **టాక్సిక్**, బాలాజీ - **టాక్సిక్**, తిరుమల - **ఇరుముడి**, వెంకటేశ్వర- **విశ్వనాథ్ అండ్ సన్స్**, మైత్రి శ్రీకృష్ణ స్క్రీన్-1 - **ఇరుముడి**, స్క్రీన్-2 - **ఇరుముడి**
దేవరకద్రలో.. రాఘవేంద్ర - **విశ్వనాథ్ అండ్ సన్స్**
– న్యూస్‌టుడే, మహబూబ్‌నగర్ నగరం, దేవరకద్ర

రైల్వే స్టేషన్ పరిశీలన

జడ్చర్ల పట్టణం, న్యూస్‌టుడే: జడ్చర్ల రైల్వే స్టేషన్‌ను సోమవారం సాయంత్రం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సందర్శించారు. రైల్వే అధికారులు ఆయనకు స్వాగతం పలికారు. ఆధునికీకరణ పనులను పరిశీలించారు. ఎంపీ డీకే అరుణ, భాజపా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు అమర్నాథ్‌గౌడ్, మండలాధ్యక్షుడు రామకృష్ణ, నాయకులు బాలాత్రిపుర సుందరి, జనార్దన్‌రెడ్డి, రాజేశ్వర్, శ్రీనివాస్‌గౌడ్, బాలవర్ధన్, శ్రీనివాస్‌రెడ్డి, రమేష్‌జీ, సాహితీరెడ్డి, నాగరాజు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ కమిటీ జాతీయ ఛైర్మన్‌గా రమేష్‌నాయక్

జడ్చర్ల పట్టణం, న్యూస్‌టుడే: గిరిజన విద్యార్థి సంఘం క్రమశిక్షణ కమిటీ జాతీయ ఛైర్మన్‌గా జడ్చర్ల మండలంలోని కొత్తతండాకు చెందిన రమేష్‌నాయక్ ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయ నూతన కార్యవర్గ సమావేశంలో ఆయనను ఎన్నుకున్నారు. గిరిజన నాయకులు సన్మానించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

జడ్చర్ల పట్టణం, న్యూస్‌టుడే: జడ్చర్లలో సోమవారం టీయూడబ్ల్యూజేహెచ్ 143 యూనియన్ కార్యవర్గం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అమర్నాథ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా శ్రీకాంత్‌రెడ్డి తదితరులు ఎన్నికయ్యారు. వీరిని సన్మానించారు.

ఉపాధ్యాయ దంపతులకు అభినందన

టీఎన్ శ్రీధర్, ఎం.సురేఖకు ప్రశంసా పత్రం అందజేస్తున్న నవీన్ నికోలస్

నవాబ్‌పేట, పాలమూరు, న్యూస్‌టుడే: పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి టీఎన్ శ్రీధర్, ఎం.సురేఖ దంపతులు చేస్తున్న కృషి అభినందనీయమని పాఠశాల విద్యా సంచాలకుడు నవీన్ నికోలస్ అన్నారు. సోమవారం ఆయన ఛాంబర్‌కు దంపతులను ఆహ్వానించి ప్రశంసా పత్రం, ప్రయోగ పరికరాల కిట్ అందజేశారు. నవాబ్‌పేట ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడి ఇంటిపై సొంత నిధులు రూ.12 లక్షలతో సైన్స్ ప్రయోగశాలను ఏర్పాటు చేసి, ఉచితంగా బోధించడం సంతోషకరమన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం సహించం

మహమ్మదాబాద్, పాలమూరు, న్యూస్‌టుడే: విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా విద్యాధికారిణి విజయకుమారి అన్నారు. కేజీబీవీలో ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదని, సమస్యలు తలెత్తుతున్నాయని అధికారుల దృష్టికి రావడంతో సోమవారం ఆమె తనిఖీ చేశారు. విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఆదివారం విద్యార్థినులు గోడ దూకి పారిపోయారనే సమాచారం మేరకు సీసీ కెమెరాలు పరిశీలించారు. జీసీడీవో అస్రాఖాద్రి, మండల విద్యాధికారి రాజు నాయక్ విచారణ చేసి నివేదిక అందించాలని సూచించారు. * నగరంలోని ప్రభుత్వ మోడల్ బేసిక్ ఉన్నత పాఠశాలలో డీఈవో విజయకుమారి ఎంఈవోలు, కాంప్లెక్స్ హెచ్ఎంలు, అకడమిక్ ప్యానల్ తనిఖీ కమిటీతో సమీక్షించారు.

ఉపాధ్యాయిని సుమతికి వీడ్కోలు

కుటుంబ సభ్యులతో ఉపాధ్యాయిని భూరెడ్డి సుమతి

మహబూబ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: గాజులపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయిని భూరెడ్డి సుమతి ఉద్యోగ విరమణ కార్యక్రమం సోమవారం జరిగింది. కార్యక్రమంలో అధికారులు పి.కృష్ణయ్య, మంజుల, నాయకులు శ్యాంబాబు, అరవింద్‌కుమార్, వెంకటేష్, శ్రీపాల్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రంలో అభివృద్ధి పనుల ప్రారంభం

రూ.31.19 కోట్లతో శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే

శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల, న్యూస్‌టుడే: ఇచ్చిన హామీ ప్రకారం నిర్వాసితుల మెరుగైన జీవనం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి పనులు చేస్తున్నానని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. సోమవారం జడ్చర్ల మండలం ఉదండాపూర్ జలాశయ నిర్వాసితుల పునరావాస కేంద్రంలో రూ.13.69 కోట్లతో వివిధ పనులకు శంకుస్థాపన చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అంగన్‌వాడీలు, పశువైద్య శాఖ కేంద్రం, రెండు ఫంక్షన్‌హాళ్లు, ఆరు సామాజిక భవనాలకు భూమి పూజ చేశారు. ఇక్కడ జరిగిన సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వం నిర్వాసితులను నిర్లక్ష్యం చేసిందని, తాను ప్యాకేజీ పెంచడంతో పాటు అభివృద్ధి పనులు చేస్తున్నానని చెప్పారు. అనంతరం పోలేపల్లి, మాచారంలో స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. చౌటగడ్డతండా, చిట్టిబోయినపల్లితండాలో ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభించారు. చిన్నపల్లి ప్రాథమిక పాఠశాలలో ఎఫ్ఎల్ఎన్‌ను పరిశీలించారు. కార్యక్రమాల్లో సర్పంచి శేఖర్, మార్కెట్ వైస్ ఛైర్మన్ రాజేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

నిర్మించారు.. విస్మరించారు

బాలానగర్ మండలం కేతిరెడ్డిపల్లి పంచాయతీ భవనాన్ని రూ.20 లక్షల నిధులతో నిర్మించారు. 2023లో నిర్మాణం పూర్తయినా ప్రారంభానికి నోచుకోవడం లేదు. ఆవరణలో పిచ్చిమొక్కలు పెరుగుతున్నాయి. వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఎంపీడీవో అనిల్‌కుమార్‌రెడ్డిని వివరణ కోరగా.. ఎమ్మెల్యే సమయమిస్తే ప్రారంభిస్తామన్నారు. – న్యూస్‌టుడే, బాలానగర్

శక్తి స్కీం, జీవో 97ను రద్దు చేయాల్సిందే

మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

ఈనాడు, దిల్లీ: తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న శక్తి స్కీం, జీవోనం.97ను రద్దు చేసి పాత పద్ధతిలో పాలిటెక్నిక్‌ను కొనసాగించాలని భారాస నేత, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన దిల్లీలోని తెలంగాణ భవన్‌లో విలేకర్లతో మాట్లాడారు. 'రాష్ట్రంలో 80వేల మంది విద్యార్థులు 10 వేలమంది ఉపాధ్యాయులు శక్తి స్కీమ్, జీవోనం.97ను రద్దు చేయాలని ఆందోళన చేస్తున్నారు. విద్యార్థులను ఇంజినీర్లుగా చేయాల్సిన ప్రభుత్వం కూలీలను చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రూ.కోట్ల విలువైన పాలిటెక్నిక్ కళాశాలల భూముల్ని ప్రైవేటు వారికి ధారాదత్తం చేయడానికి ప్రభుత్వం సిద్ధమైంది. ఫీజు రీయింబర్స్‌మెంటు బకాయిలను చెల్లించకుండా విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటోంది. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే పెద్దఎత్తున ఉద్యమం చేస్తాం' అని శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. కార్యక్రమంలో భారాస నేతలు, విద్యార్థి నాయకులు పాల్గొన్నారు. ● జనగణనలో ఓబీసీ కులగణన శాస్త్రీయంగా, పారదర్శకంగా నిర్వహించాలని, ప్రతి కులానికి యూనిక్ కోడ్ కేటాయించాలని శ్రీనివాస్‌గౌడ్ కోరారు. ఈ మేరకు రిజిస్ట్రార్ జనరల్, సెన్సస్ కమిషనర్ ఆఫ్ ఇండియా కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. మాజీ ఐఏఎస్ చిరంజీవులు, బీసీ పొలిటికల్ ఫ్రంట్ అధ్యక్షుడు బాలరాజ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

ప్రజలకు విలువైన సేవలు

మహబూబ్‌నగర్ నేరవిభాగం, న్యూస్‌టుడే: పోలీస్ శాఖలో సుదీర్ఘ కాలం పని చేసి ప్రజలకు విలువైన సేవలను అందించారని ఎస్పీ డి.జానకి అన్నారు. స్థానిక పోలీస్ ప్రధాన కార్యాలయంలో ముగ్గురు ఎస్సైలు, హెచ్‌సీ ఉద్యోగ విరమణ చేశారు. ఎస్సైగా పని చేస్తున్న శ్యామ్ సుందర్ 42 ఏళ్లు, యాసిన్ ఎస్‌బీ ఎస్సైగా 37 ఏళ్లు, ఏఆర్ఎస్సై మద్దిలేటి 37 ఏళ్లు, నవాబ్‌పేట హెచ్‌సీ శ్రీనివాసులు 35 ఏళ్లు విధులను సమర్థంగా నిర్వహించి మన్ననలు అందుకున్నారని ఎస్పీ కొనియాడారు. అదనపు ఎస్పీ ఎన్‌బీ రత్నం, ఏఆర్ అదనపు ఎస్పీ సురేశ్‌కుమార్, డీసీఆర్‌బీ డీఎస్పీ వెంకట రమణా రెడ్డి, ఏవో రుక్మిణీబాయి, సీఐ అప్పయ్య, ఎస్పీ సీసీ రాంరెడ్డి, ఆర్ఐలు కృష్ణయ్య, అశోక్‌కుమార్, ఎస్బీ ఎస్సై శీనయ్య, మధు, బాలరాజు ఉన్నారు.

ఆర్ఆర్ఆర్ నిర్వాసితులకు నోటీసులు

బాలానగర్, న్యూస్‌టుడే: పెద్దాయపల్లి, చిన్నరేవల్లి, పోచమ్మగడ్డతండా పరిధిలో ప్లాట్లు, వ్యవసాయ భూములున్న వారికి సోమవారం హెచ్ఎండీఏ నోటీసులు జారీ చేసింది. 100 మీటర్ల వెడల్పుతో రీజినల్ రింగ్ రోడ్డు(ఆర్ఆర్ఆర్) నిర్మాణం చేపట్టనున్నట్లు, అందుకు భూములు తీసుకుంటున్నట్లు ఈ నెల 12న ఇచ్చిన లేఖలో పేర్కొన్నారు. అలైన్‌మెంట్ మార్చడం సాధ్యం కాదని చెప్పారు. అందుకు సంబంధించి తాజాగా నోటీసులిచ్చారు. భూములిస్తే ఎలా బతుకుతామని నిర్వాసితులు వాపోతున్నారు.

కరస్పాండెంట్లే మార్గదర్శకులు

మహబూబ్‌నగర్ వ్యవసాయం, న్యూస్‌టుడే: కరస్పాండెంట్లే బ్యాంకులకు మార్గదర్శకులని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ జోనల్ మేనేజర్ ఎం.రవీంద్రబాబు పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన బ్యాంకు కరస్పాండెంట్ల సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యూనియన్ బ్యాంక్ ప్రాంతీయ శాఖల అధికారులు డి.వెంకటేశ్వర్లు, మురళీకృష్ణ పాల్గొన్నారు.

మీర్ మహబూబ్ అలీఖాన్‌కు నివాళి

మహబూబ్‌నగర్ నగరం, న్యూస్‌టుడే: అసఫ్‌జాహీ వంశ ఆరో నిజాం మీర్ మహబూబ్ అలీఖాన్ వర్ధంతిని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని మక్కా మసీదు ఆవరణలోని ఆయన సమాధిపై నివాళి అర్పించారు. జిల్లా కేంద్రానికి చెందిన మీర్ మహబూబ్ అలీఖాన్ ఫౌండేషన్ అధ్యక్షుడు అబ్దుల్ రహీం ఆధ్వర్యంలో పూల చాదర్ సమర్పించారు. జిల్లాకు ఆయన నామకరణం చేయడం అదృష్టమన్నారు.

గొలుసుకట్టు విధానంలో సాగునీరిస్తాం

కాల్వల వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

అడ్డాకుల, న్యూస్‌టుడే: కాల్వల నిర్మాణాలు పూర్తిచేసి, గొలుసుకట్టు ద్వారా సాగునీరు అందిస్తామని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. కేఎల్ఐ ద్వారా ఖిల్లాగణపురం, అడ్డాకుల, మూసాపేట మండలాలకు సాగునీరు అందించే కాల్వల పనులను సోమవారం పరిశీలించారు. డి12, డి13, డి8 కాల్వల పనులు నిలిచిపోవడంతోనే దేవరకద్ర నియోజకవర్గంలోని 7 వేల ఎకరాలకు సాగునీరు అందడంలేదని గుర్తించారు. రాంరాంపల్లి, లట్టుపల్లి గ్రామాలతో పాటు మూసాపేట మండలంలోని నిజాలాపూర్ పెద్దచెరువు, అడ్డాకుల మండలం కందూరు శివారులోని లోకసముద్రం, బైరవుని చెరువు పాటు కాల్వలను పరిశీలించారు. గట్టుకాడిపల్లిలో డి12 కాల్వను 2 కిలోమీటర్ల మేర పూర్తిచేస్తే అడ్డాకుల, మూసాపేట మండలాలకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించొచ్చని అధికారులు వివరించారు. మల్కాపురంలో డి8 కాల్వనూ పూర్తి చేయాలన్నారు. కేఎల్ఐ నీటిని బైరవుని చెరువుకు తీసుకువచ్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే సూచించారు. గత పాలకులు కేఎల్ఐ బ్రాంచి కేనాల్‌ను విస్మరించారని, అసెంబ్లీలో చర్చించి పూర్తి చేయిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచులు దశరథ్‌రెడ్డి, రాంచందర్, మహేందర్, కమలమ్మ, నాయకులు నాగిరెడ్డి, శ్రీహరి, శెట్టిశేఖర్, విజయ్‌మోహన్‌రెడ్డి, బగ్గికృష్ణయ్య, రాఘవేందర్‌రెడ్డి, మేఘనాథ్, శకుంతలమ్మ పాల్గొన్నారు.

కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం..

దేవరకద్ర, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి సోమవారం దేవరకద్ర మండలం గూరకొండ పాఠశాలలో ఏఐ కంప్యూటర్ ల్యాబ్, ఇందిరమ్మ గృహాలను ప్రారంభించారు. మండలంలో 6 పాఠశాలల్లో ఏఐ బోధన కొనసాగిస్తున్నట్లు చెప్పారు. సర్పంచి చెన్నమ్మ, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు అంజిల్‌రెడ్డి, పుర వైస్‌ఛైర్మన్ యుగేంధర్‌రెడ్డి పాల్గొన్నారు.

'వారి దాడి పిరికిపంద చర్య'

మెట్టుగడ్డ (మహబూబ్‌నగర్), న్యూస్‌టుడే: భాజపా రాష్ట్ర కార్యాలయంపై సోమవారం కాంగ్రెస్ గూండాల దాడి ఓ పిరికిపంద చర్య అని ఎంపీ డీకే అరుణ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగ ప్రతిని చేతబట్టి నీతి సూక్తులు వల్లించే డూప్లికేట్ గాంధీ ఈ దాడిపై స్పందించాలని డిమాండ్ చేశారు. రక్షణ కల్పించడంలో ఇంటెలిజెన్స్, స్థానిక పోలీసులు పూర్తిగా విఫలమయ్యారన్నారు.

మట్టి తవ్వకాల అడ్డగింత

చిన్నచింతకుంట, న్యూస్‌టుడే: కురుమూర్తి దేవస్థాన పరిసరాల్లో గుట్టకు మట్టి తవ్వకాలను భాజపా నాయకులు సోమవారం అడ్డుకున్నారు. కురుమూర్తి కొండలను కొల్లగొడుతున్నారని భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నంబిరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు కుర్వ రమేష్ ఆరోపించారు. అనంతరం ప్రజావాణిలో ప్రజావాణి రాష్ట్ర ప్రత్యేకాధికారి సహదేవ్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో హరినాథ్‌జీ, బాలస్వామి యాదవ్, శ్రీకృష్ణ, మాసన్న, అంజన్న పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులు సత్వరం పరిష్కరించాలి

అదనపు కలెక్టర్‌కు విన్నవిస్తున్న అర్జీదారు

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, క్షేత్ర స్థాయిలో విచారించి సత్వరం పరిష్కరించాలని అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి అర్జీలను స్వీకరించారు. డీఆర్వో నిర్మల, జడ్పీ సీఈవో వెంకట రెడ్డి, డీఆర్‌డీవో నరసింహులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ బిల్లుల మంజూరుకు లంచం..: నగరంలోని 15వ డివిజన్‌లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల బిల్లుల మంజూరుకు ఓ నేత డబ్బులు డిమాండ్ చేస్తున్నారని కాలనీ వాసులు కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. 70 శాతం లబ్ధిదారులు లంచం ఇచ్చి పనులు చేయించుకోవాల్సి వచ్చిందన్నారు.

● తనకు ప్రాణహాని ఉందని రక్షణకు ఆయుధం లైసెన్సుకు అర్జీ పెట్టుకుంటే అధికారులు ఇవ్వడం లేదని జిల్లా కేంద్రానికి చెందిన రాఘవేందర్‌రాజు ఫిర్యాదు చేశారు. తనపై కేసులున్నాయని, తప్పుడు నివేదిక సమర్పించి అడ్డుకుంటున్నారని పేర్కొన్నారు.

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: వన మహోత్సవం విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో అధికారుల సమన్వయ సమావేశంలో మాట్లాడారు. చేయూత, ఇందిరమ్మ ఇళ్లు, గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలు, భూభారతి, ప్రజావాణి కార్యక్రమాల అమలుపై సమీక్షించారు.

కాంగ్రెస్ నేతల ఆందోళన

అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నేతలు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: దేశంలో ప్రజాస్వామ్యం అణచివేతకు గురవుతోందని డీసీసీ అధ్యక్షుడు సంజీవ్‌ముదిరాజ్ వాపోయారు. ఉత్తరాఖండ్‌లో రాహుల్‌గాంధీపై కేసు నమోదు చేయడాన్ని నిరసిస్తూ డీసీసీ ఆధ్వర్యంలో సోమవారం కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలతో కలిసి నగరంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ కూడలిలో కేంద్రంలోని భాజపా ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్రమోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రకార్డులు ప్రదర్శించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ బెక్కరి అనిత, డీసీసీ నేతలు సత్తూరు చంద్రకుమార్‌గౌడ్, వినోద్‌కుమార్, బెక్కరి మధుసూదన్‌రెడ్డి, గోపాల్‌యాదవ్, కార్పొరేటర్లు ఉమెర్ కొత్వాల్, ప్రవీణ్‌కుమార్, రమేష్ బాబు, మహ్మద్ తాహెర్ పాల్గొన్నారు.

దాడికి పాల్పడ్డ వారిపై చర్యలు

కార్పొరేషన్ : ఆర్టీసీ డ్రైవర్‌పై దాడికి పాల్పడ్డ ఇద్దరు వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ ఉద్యోగుల ఐకాస నాయకులు సోమవారం మహబూబ్‌నగర్ డిపో ఎదుట ఆందోళన చేపట్టారు. ప్రయాణికులతో ఉన్న బస్సులో విధులు నిర్వహిస్తున్న డ్రైవర్‌పై విచక్షణా రహితంగా దాడికి తెగబడ్డవారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించాలని నినాదాలు చేశారు. చర్యలు తీసుకోకుంటే సమ్మె చేపడతామని హెచ్చరించారు. ఆందోళనలో ఆర్టీసీ ఐకాస నాయకులు జీఎల్ గౌడ్, విజయబాబు, సాయిరెడ్డి, కుర్మయ్య, శ్రీనివాసులు, జయరాజ్, ఆంజనేయులు, విజయలక్ష్మి, వీఎస్ రెడ్డి పాల్గొన్నారు.

మార్మోగిన శ్రీరాఘవేంద్రస్వామి నామస్మరణ

మహబూబ్‌నగర్ : రథోత్సవంలో భక్తులు

జడ్చర్ల: స్వామివారి ఊరేగింపు

మహబూబ్‌నగర్ సాంస్కృతికం, జడ్చర్ల పట్టణం, న్యూస్‌టుడే: శ్రీరాఘవేంద్రస్వామి నామస్మరణతో పాలమూరు నగర వీధులు మార్మోగాయి. ఆరాధన ఉత్సవాల్లో చివరిరోజు సోమవారం స్వామివారి రథాన్ని నగరంలో ఊరేగించారు. జడ్చర్లలో రాఘవేంద్రస్వామి ఆరాధన మహోత్సవాలు సోమవారం ముగిశాయి. మహారథంపై స్వామివారి ఊరేగింపు నిర్వహించారు.

డబుల్ బెడ్‌రూం కాలనీకి బస్సు నడపండి

కార్పొరేషన్, న్యూస్‌టుడే: నగర పరిధిలోని 4వ డివిజన్ దివిటిపల్లి డబుల్ బెడ్‌రూమ్ కాలనీకి బస్సు నడపాలని కార్పొరేటర్ అనుప ఆంజనేయులు ఆధ్వర్యంలో కాంగ్రెస్, సీపీఎం నాయకులు సోమవారం మహబూబ్‌నగర్ ఆర్టీసీ డిపో అధికారులకు వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు సిరిగిరి మురళీ, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కడియాల మోహన్, రాజ్‌కుమార్, ఆదివిష్ణు పాల్గొన్నారు.

పదోన్నతులు నిలిపివేయడం తగదు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: విద్యుత్తు సంస్థలో ఉన్నట్లుండి నిలిపి వేసిన జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ (జేఏవో) పదోన్నతులు అమలు చేయాలని విద్యుత్తు సంస్థ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఎస్ఈ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. సంఘం రీజినల్ అధ్యక్షుడు కె.నారాయణ్‌నాయక్, కార్యదర్శి టి.గంగాధర్ మాట్లాడారు. సంఘం జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు హుస్సేన్, ఉపాధ్యక్షుడు ఎం.మోహన్‌బాబు, రామకృష్ణ పాల్గొన్నారు

భూసమస్యలపై నిరసన

హన్వాడ, న్యూస్‌టుడే: పలు గ్రామాల్లో వివాదాస్పదంగా ఉన్న భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం నాయకులు జిల్లా కార్యదర్శి లక్ష్మయ్య ఆధ్వర్యంలో సోమవారం రెవెన్యూ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు.

సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా

మహబూబ్‌నగర్ నగరం, న్యూస్‌టుడే: గత ప్రభుత్వంలో నగరంలో నిర్మించిన సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులవుతున్నా ప్రారంభించలేదని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రాములు అన్నారు. సోమవారం అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో ప్రసంగించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నా శాశ్వత వైద్యులు లేరన్నారు. నగర కార్యదర్శి చంద్రకాంత్, రాజ్‌కుమార్, కె.మోహన్ పాల్గొన్నారు.

లారీ ఢీకొని ఒకరికి గాయాలు **మూసాపేట, న్యూస్‌టుడే:** ముందు వెళ్తున్న బైకును లారీ ఢీకొట్టిన ప్రమాదంలో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. పెబ్బేరు మండలం రంగాపూర్ గ్రామానికి చెందిన నర్సింహ ద్విచక్ర వాహనంపై హైదరాబాద్ వైపు వెళ్తున్నారు. సోమవారం రాత్రి మూసాపేట వంతెన నిర్మాణం వద్ద వెనక నుంచి లారీ ఢీకొట్టింది. ఆయన కుడి కాలు నుజ్జునుజ్జు అయింది. పోలీసులు క్షతగాత్రుడిని మహబూబ్‌నగర్ జనరల్ ఆసుపత్రికి తరలించారు. లారీ డ్రైవరు పారిపోయినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మరొకరికి **మిడ్జిల్, న్యూస్‌టుడే:** రోడ్డు ప్రమాదంలో వ్యక్తి గాయపడిన ఘటన మిడ్జిల్ మండలం లింబ్యాతండా శివారులో 167వ జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలం రేవల్లికి చెందిన శ్రీశైలం ద్విచక్ర వాహనంపై జడ్చర్ల నుంచి స్వగ్రామం వెళ్తున్నారు. గుర్తు తెలియని వాహనం ఢీకొంది. స్థానికులు జడ్చర్లలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

చిరుత దాడిలో ఎద్దు మృతి **గండీడ్, కోయిలకొండ, న్యూస్‌టుడే:** చిరుత దాడిలో ఎద్దు మృతిచెందిన ఘటన గండీడ్ మండలం కొండాపూర్ గ్రామ శివారులో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతు వెంకటయ్య పొలంలో ఆదివారం రాత్రి చిరుత దాడి చేసింది. చిరుత సంచారంపై అటవీశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా నిర్లక్ష్యంగా ఉన్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ● కోయిలకొండ మండలం లింగుపల్లికి చెందిన రైతు భీమన్న గేదె నియంత్రిక వైరుకు తగిలి విద్యుదాఘాతంతో మృతి చెందింది. రూ.50 వేల నష్టం వాటిల్లినట్లు రైతు తెలిపారు.

పోలీసులకు ఫిర్యాదు **మిడ్జిల్, న్యూస్‌టుడే:** ఉత్తరాఖండ్‌లో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పాల్గొన్న బహిరంగ సభ స్థలాన్ని శుద్ధిచేసి, యజ్ఞం నిర్వహించడం సరికాదని కాంగ్రెస్ ఎస్సీసెల్ నాయకుడు మండిపడ్డారు. ఈ ఘటనపై సోమవారం ఎస్సై శ్రీనివాసులుకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో నాయకులు చెన్నయ్య, రవి, నందం, సురేష్, బంగారు, రాజేశ్, మణ్యం పాల్గొన్నారు.

IN THE COURT OF THE JUNIOR CIVIL JUDGE AT MAHABUBNAGAR
O.S.No. 240 of 2026
Between:-
Pyatla Lingam and another ... *Plaintiffs*
And
1. Tahsildar, Nawabpet
2. To whom so ever it is concern ... *Defendants*
The,
Whom so ever it may concern Defendant No.2
NOTICE
The above suit was filed by the plaintiffs U/s. 26 C.P.C. R/w. Order 7 Rule 1 of C.P.C. against the defendants for declaration that they are the legal heirs of deceased Late Pyatla Mahesh. The above case stands posted on 30-09-2026 before the Hon'ble court. You the above named Defendant No.2 (whom so ever it may concern) If any persons are any claim are hereby directed to appear before the court on the said date and they may submit their claims or objections before the Hon'ble court at about 10.30 AM, on 30-09-2026, if no objections are received, the matter will be decided on the material available on record.
// By order of the Court //
Sd/., **K.C. NARSIMULU,** Advocate
H.No.10-6-98/2, Srinivasa Colony, Mahabubnagar-509001. Cell No. 9848235809

IN THE COURT OF THE HON'BLE FAMILY COURT JUDGE :: KADAPA.
Cri.M.P.No.255/2025 M.C.No.3/2020
Tomala Sudha Lakshmi, W/o Narva Sridhar Rao, C/o Krishna Venamma, Aged 26 years, Hindu, R/a. D.No.15/359, Gujula Veedhi, Kadapa City, Kadapa District, Andhra Pradesh. **- PETITIONER**
And
Narva Sridhar Rao, S/o N.Madhan Mohan Rao, Aged 30 years, Hindu, R/a. 6-54, Teacher's Colony, Palem Village, Mahaboob Nagar-509215, Telangana State. **- RESPONDENT.**
NOTICE TO RESPONDENT
Please take Notice that the above Petitioner has filed the above arrears petition in Crl.M.P. No.255/2025 against you U/Sec.125(3) Cr.P.C (or) U/Sec.144(3) of BNSS, 2023 against you and the above case stands posted for your appearance either Personally or through advocate, at 10.30 A.M. on **25-09-2026** before the said Hon'ble Court and if you fail to appear, matter will be decided Ex-parte.
"BY ORDER OF THE COURT"
SRI G.TRIVIKRAM SINGH,
Advocate for Petitioner, Kadapa City, Y.S.R. District, Cell No.98667 90979.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన లారీ

• భార్య మృతి, భర్తకు తీవ్రగాయాలు

మహబూబ్‌నగర్ నేరవిభాగం, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తున్న భార్యాభర్తలను లారీ ఢీకొట్టడంతో భార్య మృతి చెందగా, భర్తకు తీవ్ర గాయాలైన ఘటన మండల పరిధిలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై విజయ్‌కుమార్ కథనం మేరకు.. దేవరకద్రకు చెందిన గుంతపల్లి కృష్ణ, అతని భార్య స్వాతి (26) ద్విచక్ర వాహనంపై మహబూబ్‌నగర్ నుంచి ఇంటికి వెళ్తున్నారు. మహబూబ్‌నగర్ మండలం ధర్మాపూర్ వద్ద వెనక నుంచి వచ్చిన లారీ వారి వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దంపతులు రోడ్డుపై పడ్డారు. ఈ క్రమంలో లారీ టైర్ స్వాతిపై నుంచి వెళ్లడంతో ఆమె అక్కడికక్కడే మరణించింది. తీవ్రగాయాల పాలైన భర్త కృష్ణను మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు బావమరిది వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇంట్లో చోరీ **హన్వాడ :** నాయినోనిపల్లిలోని ఓ ఇంట్లో సోమవారం దొంగతనానికి పాల్పడ్డారు. పి.కేశవులు, కుటుంబ సభ్యులు హైదరాబాద్ వెళ్లారు. సాయంత్రం వచ్చి చూడగా నాలుగు తులాల బంగారం, రూ.50 వేల నగదును ఎత్తుకెళ్లారు. కేశవులు ఫిర్యాదు మేరకు పోలీసులు ఆదివారం రాత్రి ఇంటిని పరిశీలించి కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

మతిస్థిమితం లేని మహిళకు ఆశ్రయం **మహబూబ్‌నగర్ నగరం :** మతిస్థిమితం లేని మహిళను మహిళాశిశు సంక్షేమ శాఖ 'సఖి' సిబ్బంది చేరదీసి ఆశ్రమానికి తరలించారు. సోమవారం షాషాబ్‌గుట్టలో మహిళ ఉన్నట్లు స్థానికులు 181కి సమాచారమిచ్చారు. మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి జరీనా బేగం ఆదేశాలతో సఖి సిబ్బంది రెండో పట్టణ ఠాణా పోలీసుల సాయంతో వివరాలు ఆరా తీయగా.. తన పేరు ఆయేషా యాస్మిన్, జడ్చర్ల అని చెప్పింది. సిబ్బంది ఆమెను జడ్చర్లలోని సత్యేశ్వర ఆశ్రమానికి తరలించారు.

LIC వ్యవస్థాపక దినోత్సవ శుభాకాంక్షలు
మా యొక్క LIC పాలసీ దారులకు, అధికారులకు, శ్రేయోభిలాషులందరికీ, ఏజెంట్లకు LIC 70వ వార్షికోత్సవ శుభాకాంక్షలు.
అభినందనలతో...
STAR | LIC HFL
LIC Agent & LIC Home Loan Agent
మందాడి రాములు B.Sc
Area office, Jadcherla, New Premnagar, MBNR
Cell: 9494019299, 9392856340